శుక్రవారం
18-10-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 117
పేజీలు : 6+8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

షేక్ హసీనాపై అరెస్టు వారెంట్

ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాపై అరెస్టు వారెంట్ జారీ అయింది. ఆ దేశానికి చెందిన ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్ ఈ వారెంట్ ఇచ్చింది. నవంబరు 18లోగా ఆమెను అరెస్టు చేసి తమ ఎదుట హాజరు పరచాలని ఐసీటీ ప్రధాన ప్రాసిక్యూటర్ మహమ్మద్ తజుల్ ఇస్లాం తన ఆదేశాల్లో పేర్కొన్నారు. రిజర్వేషన్లపై విద్యార్థుల నిరసనలు హింసాత్మకంగా మారడంతో ప్రధానిగా ఉన్న షేక్‌హసీనా పదవి నుంచి వైదొలగడం... తర్వాత వేరే దేశంలో తలదాచుకోవడం తెలిసిందే. ఆమె ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. జులై 15 నుంచి ఆగస్టు 5 వరకు జరిగిన మారణహోమం, ఇతర నేరాల ఆరోపణలపై హసీనాకు వ్యతిరేకంగా ఐసీటీకి 60 ఫిర్యాదులు అందాయి. వాటిపై ట్రిబ్యునల్ ఇటీవల దర్యాప్తు ప్రారంభించింది.

తుపాను కల్లోలం

తడ వద్ద తీరం దాటిన వాయుగుండం

- భారీవర్షాలతో కోస్తా, సీమ జిల్లాలు అతలాకుతలం
- అధికారయంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన సీఎం
- జలాశయాలకు భారీ వరద

నెల్లూరులో...

విశాఖ తీరంలో ఎగసిపడుతున్న అలలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి /విశాఖపట్నం: వాయుగుండం ప్రభావంతో కోస్తా, సీమ జిల్లాలు అతలాకుతలమయ్యాయి. తిరుపతి జిల్లా తడ వద్ద వాయుగుండం తీరం దాటింది. 22 కిలోమీటర్ల వేగంతో కదిలి తీరాన్ని తాకినట్లు వాతావరణశాఖ ప్రకటించింది. అనంతరం అల్పపీడనంగా బలహీనపడింది. ఈ ప్రభావంతో రాష్ట్రంలోని కోస్తా, రాయలసీమ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాయలసీమ జిల్లాలతో పాటు ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, తూర్పుగోదావరి, విశాఖ జిల్లాల్లో కొన్నిచోట్ల జనజీవనం స్తంభించింది. విశాఖపట్నం, కాకినాడ తీరాల్లో పెద్ద ఎత్తున సముద్రపు అలలు ఎగసిపడుతున్నాయి. విశాఖలోని ఆర్కే బీచ్ వద్ద అలలు దుకాణాలను తాకాయి. కాకినాడ జిల్లాలోని యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంలో సముద్రం అల్లకల్లోలంగా మారింది. భారీగా రాకాసి అలలు ఎగసిపడుతున్నాయి. చెట్లు, విద్యుత్ స్తంభాలు, ఇళ్లు నేల కూలాయి. అంతర్వేది తీరంలో సముద్రం అల్లకల్లోలంగా ఉంది. గోదావరి సంగమం వద్ద అలలు ఎగసిపడుతున్నాయి. పల్లిపాలెంలో ఇళ్లు, బీచ్

- మిగతా 2 లో

26న 'హెచ్చరిక' ర్యాలీలు

సంయుక్త్ కిసాన్ మోర్చా ప్రకటన

న్యూఢిల్లీ: నల్ల వ్యవసాయ చట్టాల రద్దు, పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కల్పించేలా చట్టం చేయడం సహా ఇతర డిమాండ్ల సాధన కోసం ఢిల్లీ సరిహద్దుల్లో చేపట్టిన ఉద్యమానికి నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా రైతులు ప్రత్యేక కార్యక్రమాలకు పిలుపునిచ్చారు. నవంబర్ 26న దేశ వ్యాప్తంగా 500 జిల్లాల్లో చేతావనీ (హెచ్చరిక) ర్యాలీలు నిర్వహించాలని సంయుక్త్ కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) నిర్ణయించింది. తమ డిమాండ్లు పరిష్కరించకపోతే వచ్చే ఏడాది

- మిగతా 2 లో

సెక్షన్ 6ఎ రాజ్యాంగబద్ధమే: సుప్రీం

న్యూఢిల్లీ: పౌరసత్వ చట్టం-1955లోని సెక్షన్ 6ఎ రాజ్యంగ బద్ధతను సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం గురువారం సమర్థించింది. సీజేఐ డీవై చంద్రచూడ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ జేబీ పార్థీవాలా, జస్టిస్ మనోజ్‌మిశ్రాతో కూడిన ధర్మాసనం 4:1 మెజార్టీతో తీర్పును వెలువరించింది. న్యాయమూర్తుల్లో జస్టిస్ పార్థీవాలా మాత్రమే ఇది రాజ్యాంగ విరుద్ధమంటూ భిన్నాభిప్రాయం వ్యక్తంచేశారు. చంద్రచూడ్ మాట్లాడుతూ 'అక్రమ వలసలకు అసోం ఒప్పందం ఓ రాజకీయ పరిష్కారం. అదే సమయంలో

- మిగతా 2 లో

ట్రంప్ కన్నా హారిస్ ఉత్తమం: చైనా

బీజింగ్: అమెరికాలో అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్ విజయం సాధించాలని కోరుకుంటున్నట్లు చైనీస్ పీపుల్స్ పొలిటికల్ కన్సల్టేటివ్ కాన్ఫరెన్స్ (సీపీపీసీసీ) స్టాండింగ్ కమిటీ సభ్యుడు జియా కింగ్‌గో తెలిపారు. అమెరికా అధ్యక్ష ఎన్నికలపై వ్యాఖ్యలు చేయడానికి ఆసక్తి లేదని చెబుతూ..."ట్రంప్ హయాంలో రెండు దేశాల మధ్య సంబంధాలు క్షీణించడంతో పాటు తీవ్ర ఘర్షణ తలెత్తింది. ఆయన చైనాపై తప్పుడు ఆరోపణలు చేశారు. ఇప్పటికీ

- మిగతా 2 లో

ఇదీ లోకం!

హేయ్, ధరలు... పెద్ద సారొచ్చారు ఒకసారి కిందకు దిగండి, మాట్లాడుకుందాం!

మద్యం ఆదాయ వనరా?

తాగుడికి బానిసల్ని చేసి... మందులిచ్చి మాన్పిస్తారా: నారాయణ

మద్యం వ్యాపారాన్ని ప్రభుత్వం ఆదాయ వనరుగా చూస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు.గురువారం విజయవాడ దుర్గాపురంలోని ఓ మద్యం దుకాణంలో విక్రయాలను ఆయన పరిశీలించారు.

2లో

ఇవేం ధరలు బాబూ...?

- మద్యం ప్రియుల ఉత్సాహంపై నీళ్లు చల్లిన కొత్త పాలసీ
- గతానికీ ఇప్పటికీ రేట్లలో తేడా లేదని మందుబాబుల నిట్టూర్పు
- నివాస ప్రాంతాల్లోకి చొచ్చుకొచ్చిన కొత్త షాపులు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: మద్యం ప్రియులకు ముఖ్యమంత్రి చంద్రబాబు షాక్ ఇచ్చారు. ఎన్నికల సమయంలో ఊరువాడ తిరుగుతూ వివిధ వర్గాలకు హామీలు ఇస్తున్నట్లుగా మందుబాబులకు కూడా తక్కువ ధరకు మద్యం అందుబాటులోకి తెస్తానంటూ చంద్రబాబు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నాణ్యమైన మద్యం తక్కువ ధరలకు అందిస్తామని చెబుతూ వచ్చారు. దీంతో కొత్త ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్న మందు బాబులకు నిరాశే మిగిలింది. నూతన ఎక్సైజ్ పాలసీ కోసం మంత్రుల బృందం వివిధ రాష్ట్రాల్లో పర్యటించి వచ్చింది. ఇరుగు పొరుగు రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలు, మద్యం ధరలను కూడా అధ్యయనం చేసింది. వీటన్నింటినీ పరిశీలించి మెరుగైన పాలసీ తీసుకొస్తామని ప్రకటించారు. దీనిలో భాగంగా ప్రైవేటు దుకాణాల ఏర్పాటునకు దరఖాస్తులు స్వీకరించింది. కేవలం టెండర్ రుసుము ద్వారానే ప్రభుత్వ ఖజానాకు భారీగా ఆదాయం సమకూరింది. ఈ నెల 16వ తేదీ నుండి రాష్ట్ర వ్యాప్తంగా మద్యం ప్రైవేటు షాపులు అందుబాటులోకి వచ్చాయి. గత ప్రభుత్వ హయాంలో లేని విధంగా జాతీయ, అంతర్జాతీయ మద్యం బ్రాండ్‌లు అందుబాటులోకి వచ్చినప్పటికీ, ధరల విషయంలో మాత్రం గత వైసీపీ సర్కార్‌లోని రేట్లకు ప్రస్తుత రేట్లకు పెద్దగా తేడా లేదని మందుబాబులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ

- మిగతా 2 లో

పెట్టుబడులకు స్వర్గధామం

- సమర్థ యువత, స్నేహపూర్వక ప్రభుత్వం, మౌలిక వసతులు పుష్కలం
- పారిశ్రామికవేత్తలకు సీఎం చంద్రబాబు పిలుపు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పెట్టుబడులు పెట్టడానికి ఆంధ్రప్రదేశ్ అన్నివిధాలా స్వర్గధామం వంటిందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. పంచకులలో గురువారం జరిగిన హర్యానా సీఎం నాయబ్ సింగ్ సైనీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి అతిథిగా సీఎం హాజరయ్యారు. అనంతరం ప్రధాని మోదీ అధ్యక్షతన చండీగఢ్‌లో ఎన్డీయే సీఎంల కౌన్సిల్ సమావేశం జరిగింది. ఏపీ నుంచి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హాజరుకాగా, కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్, మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, గోవా, ఒడిశా, మణిపూర్, చత్తీస్‌గఢ్ సీఎంలు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ పెట్టుబడులు పెట్టడానికి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రెడ్ కార్పెట్ ఆహ్వానమంటూ స్వాగతించారు. ఏపీ ఇప్పుడు అత్యుత్తమ పారిశ్రామిక విధానాలతో ఆహ్వానం పలుకుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్ పూర్తిగా వ్యాపార అనుకూల రాష్ట్రమని చెప్పారు. కొత్త విధానాలను పరిశ్రమ అనుభవజ్ఞులతో రూపొందించామన్నారు. వ్యవస్థాపక స్ఫూర్తి, వ్యాపారాలను పెంపొందించడమే తమ లక్ష్యమని వెల్లడించారు. దేశంలో అత్యుత్తమ వ్యాపార పర్యావరణ వ్యవస్థను నిర్మిస్తున్నామని, పారిశ్రామిక అభివృద్ధికి ఏపీ ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుంటుందని హామీ ఇచ్చారు. దేశంలో, ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి ఇంతకంటే మంచి తరుణం లేదన్నారు. ఈ ఉత్తేజకరమైన వృద్ధి ప్రయాణంలో తమకు సహకరించాలని కోరారు. వ్యాపార పరిధులు, రాష్ట్ర సామర్థ్యం పరస్పరం విస్తరించుకునే అవకాశమిదని, నూతన పెట్టుబడుల కోసం ఎదురుచూస్తున్నామని చంద్రబాబు తెలిపారు. వ్యాపారాలకు పూర్తిగా సహకరించే ప్రభుత్వం, మరోవైపు ప్రతిభావంతులైన యువత, ఉత్తమ మౌలిక

- మిగతా 2 లో

హర్యానా సీఎంగా సైనీ ప్రమాణస్వీకారం

మోదీ సహా ఎన్డీఏ నేతల హాజరు

చండీగఢ్: హర్యానాలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా నాయబ్ సింగ్ సైనీ గురువారం ప్రమాణస్వీకారం చేశారు. గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆయన తో ప్రమాణం చేయించారు. దీనికి ముందు ఆయన వాల్మీకి ఆలయంలో పూజలు చేశారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అధ్వర్యంలో రాష్ట్రం వేగంగా ముందుకువెళ్తుందని చెప్పారు. పంచకులలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎన్డీయే కూటమి నేతలు హాజరయ్యారు. ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు

- మిగతా 2 లో

ఏపీపీఎస్సీ చైర్మన్ నియామకం ఎప్పుడో?

- స్వతంత్ర పోస్టుకు రాజకీయరంగు
- పెండింగ్ పరీక్షల షెడ్యూలు జాప్యం
- అయోమయంలో నిరుద్యోగులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాజకీయాలకు కేంద్ర బిందువుగా ఏపీపీఎస్సీ చైర్మన్, పాలక మండలి నియామకాల ప్రక్రియ మారిందన్న విమర్శలు హల్‌చల్ చేస్తున్నాయి. ఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తే... వారికి అనుకూలంగా ఉన్న వారిని నియమించుకోవడం పరిపాటిగా మారింది. ఎంతో కీలకమైన గ్రూప్-1, గ్రూప్-2, ముఖ్యమైన ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో పారదర్శకతపై అనుమానాలున్నాయి. ఏపీపీఎస్సీ చైర్మన్ నియామకంలో జాప్యం ఏర్పడింది. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలవుతున్నప్పటికీ... ఇంతవరకూ చైర్మన్‌ను నియమించలేదు. వైసీపీ హయాంలో ఏపీపీఎస్సీ చైర్మన్‌గా పనిచేసిన సీనియర్ ఐపీఎస్ అధికారి గౌతమ్ సవాంగ్ రాజీనామా చేశారు. ఉద్యోగ నియామకాలపై ఆయన అనేక విమర్శలు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జులైలో ఆయన రాజీనామా చేయడం, వెనువెంటనే ఆమోదించడం జరిగిపోయాయి. దీనివెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నట్లు ప్రచారం జరిగింది. గౌతమ్ సవాంగ్‌కు ఇంకా కాలపరిమితి ఉన్నప్పటికీ... ఉన్నపళంగా రాజీనామా చేయడంతో ఏపీపీఎస్సీ చైర్మన్ కుర్చీ ఖాళీ అయింది. ఈ పదవి కోసం ప్రభుత్వ పెద్దలతో భారీ లాబీయింగ్ జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ పదవి కోసం టీడీపీకి సన్నిహితంగా ఉన్న కొందరి పేర్లు వినిపిస్తున్నాయి. కొంతమేరకు నామినేటెడ్ పోస్టులను ప్రభుత్వం ఇటీవల భర్తీ చేసింది. అందులో కీలకమైన ఏపీపీఎస్సీ చైర్మన్ ప్రస్తావన లేదు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా...సమర్థులైన సీనియర్ ఐఏఎస్ లేదా ఐపీఎస్‌తో ఏపీపీఎస్సీ చైర్మన్ నియామకం ఉండాలన్న డిమాండ్లు తెరపైకి వస్తున్నాయి.

రాష్ట్ర విభజన అనంతరం ఏపీపీఎస్సీ చైర్మన్ల నియామకాలు, వారి పరిపాలన తీరు రాజకీయ వివాదాలకు దారితీసింది. అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ...వారిపై రాజకీయ ఒత్తిళ్లు, సహకరించకపోవడం, పూర్తిస్థాయి అధికారాలు ఇవ్వకపోవడం తదితర చర్యలకు పాల్పడిన సంఘటనలున్నాయి. 2014లో టీడీపీ ప్రభుత్వ హయాంలో పిన్నమనేని ఉదయ్‌భాస్కర్‌ను ఏపీపీఎస్సీ చైర్మన్‌గా నియమించారు. అనంతరం ఏర్పడిన వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆయన పదవిలో ఉన్నప్పటికీ...సరైన సహకారం అందించలేదని, కనీసం అటెండర్‌నూ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసినట్లు ప్రచారం జోరందుకుంది. ఆయా అంశాలను ఆయనే స్వయంగా గవర్నరు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఉదయ్ భాస్కర్ పదవి ముగిశాక ఇన్‌చార్జి చైర్మన్‌గా ఏవీ రమణారెడ్డిని నియమించారు. ఆయన 2020 మార్చి నాలుగో తేదీన ఏపీపీఎస్సీ సభ్యుడిగా నియమితులయ్యారు. ఆ తర్వాత గౌతమ్ సవాంగ్‌కు చైర్మన్‌గా పూర్తి బాధ్యతలను అప్పగించారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక గౌతమ్ సవాంగ్ పదవీ కాలం

- మిగతా 2 లో

ఆ నలుగురు ఐఏఎస్‌లు సీఎస్‌కు రిపోర్ట్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తెలంగాణ రాష్ట్రానికి చెందిన నలుగురు ఐఏఎస్‌లు రాష్ట్ర ప్రభుత్వానికి రిపోర్టు చేశారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ ట్రైనింగ్ విభాగం(డీఓపీటీ) ఆదేశాలతో తెలంగాణలో విధులనుంచి రిలీవ్ అయిన నలుగురు ఐఏఎస్ అధికారులు ఆమ్రపాలి, రొనాల్డ్ రోస్, వాకాటి కరుణ, వాణిప్రసాద్ రాష్ట్రానికి రావాల్సి వచ్చింది. వారు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్‌ను కలిసి నివేదించారు. ఈనెల 16వ తేదీన తెలంగాణ హైకోర్టులో కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్) ఆదేశాలను సవాల్ చేస్తూ... తమకు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని తెలంగాణ హైకోర్టును రెండు రాష్ట్రాలకు చెందిన కొందరు ఐఏఎస్‌లు ఆశ్రయించినప్పటికీ... వారికి ఊరట దక్కలేదు.

రాష్ట్రం నుంచి రిలీవ్ అయిన ఐఏఎస్‌లలో ఎన్టీఆర్‌జిల్లా కలెక్టర్ సృజన, హరికిరణ్, శివశంకర్ ఉన్నారు. వారు కూడా తెలంగాణ సీఎస్‌కు రిపోర్ట్ చేశారు. క్యాట్‌లో ఐఏఎస్‌లు దాఖలు చేసిన పిటిషన్లపై నవంబర్‌లో విచారణ కొనసాగనుంది. వారి అభ్యంతరాలపై తుది ఉత్తర్వులు ఇంకా వెలువడలేదు. ఈలోగా ఐఏఎస్‌లు మధ్యంతర ఉత్తర్వుల కోసం తెలంగాణ హైకోర్టును ఆశ్రయించి భంగపడ్డారు.

సుప్రీం తదుపరి సీజే జస్టిస్ సంజీవ్ ఖన్నా

కేంద్రానికి సీజేఐ సిఫార్సు

న్యూఢిల్లీ: దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తదుపరి సీజేగా సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నియమితులయ్యే అవకాశం ఉంది. తన తర్వాత భారత ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా పేరును ప్రస్తుత సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఈ సిఫార్సులకు కేంద్రం ఆమోదం తెలిపితే సుప్రీంకోర్టు 51వ సీజేగా జస్టిస్ ఖన్నా నియమితులవుతారు. నిబంధనల ప్రకారం... ఈ ప్రతిపాదనను ప్రస్తుత సీజేఐ లేఖ రూపంలో కేంద్ర న్యాయశాఖకు పంపుతారు. ఆ లేఖను కేంద్ర న్యాయశాఖ... ప్రధానమంత్రి పరిశీలన కోసం పంపనుంది. ఆయన ఆమోదం తర్వాత రాష్ట్రపతికి చేరుకుంటుంది. అంతిమంగా రాష్ట్రపతి అనుమతితో తదుపరి ప్రధాన న్యాయమూర్తి బాధ్యతలు చేపడతారు. సంప్రదాయం ప్రకారం సీజేఐ తన తర్వాత ఆ పదవి చేపట్టేందుకు సుప్రీంకోర్టులోని అత్యంత సీనియర్ న్యాయమూర్తి పేరును సిఫార్సు చేస్తారు. ఆ లెక్కన జస్టిస్ డీవై చంద్రచూడ్

- మిగతా 2 లో

నిజ్జర్ హత్యలో సంజయ్ పాత్ర

ట్రూడోకు పన్నూ రాసిన పాత లేఖ వైరల్

ఒట్టావా: ఖలిస్థానీ ఉగ్రవాది నిజ్జర్ హత్య కేసులో భారత ప్రభుత్వ ఏజెంట్ల పాత్ర ఉందని కెనడా ప్రధాని జస్టిన్‌ట్రూడో వ్యాఖ్యలు చేసినప్పట 'నుంచి భారత్‌తో సంబంధాలు దెబ్బతిన్నాయి. దౌత్య సంబంధాలను పణంగా పెట్టి, ట్రూడో తన నోటికి పనిచెప్తూనే ఉన్నారు. ఈ తరుణంలో మరో విషయం వెలుగులోకి వచ్చింది. నిషేధిత 'సిఖ్స్ ఫర్ జస్టిస్' నేత గురుపత్వంత్ సింగ్ పన్నూ... కెనడా ప్రధానికి రాసిన పాత లేఖ వైరల్‌గా మారింది. నిజ్జర్ హత్యలో భారత హైకమిషనర్ సంజయ్ కుమార్ వర్మ పాత్ర ఉందని ఆరోపిస్తూ... ఆయనను బహిష్కరించాలని ఆ లేఖలో కోరాడు. ఈ బహిష్కరణ వెంటనే జరగకపోతే కెనడాలో చురుకుగా ఉన్న భారత ఏజెంట్ల చేతుల్లో మరికొంతమందికి హాని జరగొచ్చని తాము భయపడుతున్నామని అందులో పేర్కొన్నాడు. నిజ్జర్ శాంతిని కోరుకొనే, చట్టాన్ని గౌరవించే కెనడా పౌరుడని తెలిపాడు. హత్యలు మొదలు బాంబుపేలుళ్ల వరకు

అనేక అకృత్యాలకు పాల్పడిన హర్దీప్ సింగ్ నిజ్జర్- రవిశర్మ పేరిట తప్పుడు పాస్‌పోర్టుతో కెనడాలో ఆశ్రయం పొందాడు. భారత్ వ్యతిరేకికి పౌరసత్వం కట్టబెట్టిన కెనడా ప్రభుత్వం... అతడి హత్యకు సంబంధించి భారత్‌పై నిరాధార ఆరోపణలు గుప్పిస్తోంది. ఆ కేసులో భారత హైకమిషనర్, దౌత్యాధికారులను అనుమానితులుగా పేర్కొనడం రెండుదేశాల మధ్య సంక్షోభానికి దారితీసింది. అంతటితో ఆగకుండా భారత్ దర్యాప్తునకు సహకరించడం లేదని ట్రూడో ఎదురుదాడికి దిగారు. భారత ప్రధాని మోదీ నేతృత్వంలోని సర్కారుతో విభేదించే కెనడా పౌరుల వివరాలను ఇక్కడి భారత దౌత్యవేత్తలు సేకరించి, ఉన్నతస్థాయిలోని వారికి.. లారెన్స్ బిష్ణోయ్ వంటి నేరగాళ్ల ముఠాలకు చేరవేస్తున్నారని మరోసారి అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. ఈ కేసులో భారత ప్రభుత్వ ఏజెంట్ల పాత్ర ఉందని ఆరోపణలు చేసినప్పుడు తన వద్ద నిఘా సమాచారమే తప్పా పక్కా ఆధారాలేవీ లేవంటూ మాట్లాడిన మాటలు చర్చనీయాంశమయ్యాయి. దీనిపై భారత్ తీవ్రంగా స్పందించింది. 'నిజ్జర్ హత్య కేసుకు సంబంధించి మేం ఎంతోకాలంగా చెబుతున్నదే ఈ రోజు రుజువైంది. మన దౌత్యవేత్తలపై చేస్తున్న తీవ్రమైన ఆరోపణలకు మద్దతిచ్చేలా కెనడా మనకు ఎలాంటి ఆధారాలు ఇవ్వలేదు. ప్రస్తుతం రెండు దేశాల మధ్య సంబంధాలు దిగజారడానికి కెనడా ప్రధానే పూర్తి బాధ్యుడు' అని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ ఓ ప్రకటనలో వెల్లడించారు.

వలస చట్టంపైనే తొలి సంతకం

కమలా హారిస్ హామీ

వాషింగ్టన్: అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు దగ్గరపడుతున్న తరుణంలో అభ్యర్థుల ప్రచారం ఊపందుకుంది. అమెరికాలోని వలసల వ్యవస్థపై ఉపాధ్యక్షురాలు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్ కీలక వ్యాఖ్యలు చేశారు. అధ్యక్షురాలిగా ఎన్నికైతే వలసల వ్యవస్థను సరిచేసే బిల్లుపై తొలి సంతకం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె వ్యాఖ్యానించారు. 'అమెరికాలో ఇమ్మిగ్రేషన్ సమస్య ప్రధానమైనది. ఈ సమస్య పరిష్కారంపై మేం దృష్టిసారించాం. అధ్యక్షురాలిగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత ఈ వలసల వ్యవస్థను సరిచేసే బిల్లుపై సంతకం చేస్తాను. ఈ బిల్లులో వలసల సమస్య పరిష్కారానికి వనరులు పెంచడం, ఎక్కువమంది న్యాయమూర్తులను నియమించడం, జరిమానాలు కఠినతరం చేయడం వంటి అంశాలు ఉంటాయి. సరిహద్దులను బలోపేతం చేసేందుకు కాంగ్రెస్‌లోని సంప్రదాయ సభ్యులతో సహా ద్వైపాక్షిక ప్రయత్నానికి మద్దతుగా 1,500 మంది బోర్డర్ ఏజెంట్లను నియమిస్తాం. ఇది అక్రమ వలసలను నియంత్రించడంతో పాటు సరిహద్దుల వెంబడి దేశంలోకి వస్తున్న మాదక ద్రవ్యాలను నిరోధించేందుకు ఉపయోగపడుతుంది. మరో 20 రోజుల్లో జరగనున్న ఎన్నికల్లో ఈ సమస్యను పరిష్కరించగలిగే అధ్యక్షుడు ఎవరనేది ప్రజలు నిర్ణయిస్తారు' అని హారిస్ చెప్పారు. ఇటీవల కమలాహారిస్ యూఎస్- మెక్సికో సరిహద్దు ప్రాంతాన్ని సందర్శించారు. ఆ సమయంలో అక్రమ వలసలను నివారించేందుకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. అయితే హారిస్ వ్యాఖ్యలపై డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ విరుచుకుపడ్డారు. నాలుగేళ్లుగా సరిహద్దు వద్దకువెళ్లని హారిస్‌కు ఎన్నికల వేళ అక్రమ వలసల సమస్య గుర్తొచ్చిందా అని ప్రశ్నించారు. హింసాత్మక మూకలు అమెరికాలో ప్రవేశించి ఇక్కడ హత్యలు, అత్యాచారాలు చేస్తున్నా పదవిలో ఉండి పట్టించుకోలేదని మండిపడ్డారు. చిన్న పట్టణాలను ఆమె శరణార్థి శిబిరాలుగా మార్చేశారని ఆరోపించారు.

ఇరాన్‌పై దాడి చేస్తే తీవ్ర పరిణామాలు: ఐఆర్‌జీసీ

టెహ్రాన్: ఇరాన్‌పై ప్రతిదాడి చేస్తే ఆ తర్వాత చోటుచేసుకొనే పరిణామాలకు ఇజ్రాయిల్ చింతించాల్సి ఉంటుందని ఐఆర్‌జీసీ చీఫ్ హసన్ సలామీ హెచ్చరించారు. ఇటీవల ఇజ్రాయిల్ దాడిలో చనిపోయిన జనరల్ అబ్బాస్ నీలోఫర్సన్ అంత్యక్రియల్లో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'పొరబాటున కూడా ఈ ప్రాంతంలో లేదా ఇరాన్‌పై దాడి చేస్తే... మేము కచ్చితంగా తీవ్రంగా సమాధానం చెబుతాం' అని సలామీ హెచ్చరించారు. అమెరికా పంపించిన థాడ్ మిసైల్ డిఫెన్స్ వ్యవస్థ ఏమాత్రం ఆధారపడదగినది కాదని సలామీ విమర్శించారు. తమపై దాడులు చేసి ఎవరూ సురక్షితంగా ఉండలేరన్నారు. ఇజ్రాయిల్ బలహీనతలు తమకు బాగా తెలుసని పేర్కొన్నారు. మరోవైపు ఇజ్రాయిల్ దాడులను దౌత్యపరంగా ఎదుర్కొనేందుకు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాక్చి పశ్చిమాసియా దేశాల్లో పర్యటిస్తూ మద్దతు కూడగడుతున్నారు. తాజాగా ఆయన గురువారం కైరోకు చేరుకొన్నారు.

ఈజిప్ట్ ఉన్నతాధికారులతో చర్చలు జరిపారు. ఇప్పటికే సౌదీ అరేబియా, ఖతార్, ఇరాక్, లెబనాన్‌లో పర్యటించిన విషయం తెలిసిందే. అక్టోబర్ 1వ తేదీన ఇరాన్ భారీ బాలిస్టిక్ క్షిపణులతో ఇజ్రాయిల్‌పై దాడులు చేసింది. వీటిల్లో కొన్ని లక్ష్యాలకు అత్యంత సమీపంలో పడ్డాయి. మిగిలిన వాటిని ఎయిర్‌డిఫెన్స్ వ్యవస్థలు అడ్డుకొన్నాయి. ఇరాన్ దాడికి ప్రతీకారం తీర్చుకోవడానికి ఇజ్రాయిల్ సన్నద్ధమైంది.

చివరి క్షణంలో ఏమైనా మార్పులు జరిగితే తప్ప... ఇరాన్‌లో ఏయే లక్ష్యాలు ధ్వంసం చేయాలన్న అంశంపై ఇప్పటికే ఒక స్పష్టమైన ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు లక్ష్యాల జాబితాను ఇజ్రాయిల్ సైన్యం (ఐడీఎఫ్) ప్రధాని నెతన్యాహుకు, రక్షణ మంత్రి యోవ్ గలాంట్‌కు సమర్పించినట్లు ఛానల్ 12 న్యూస్ పేర్కొంది. 'లక్ష్యాలు స్పష్టంగా ఉన్నాయి. ఎప్పుడు దాడి చేయాలన్నదే నిర్ణయం కావాలి' అని కాన్ పబ్లిక్ బ్రాడ్‌కాస్టర్ కూడా ఓ కథనం ప్రచురించింది.

ఏపీపీఎస్సీ చైర్మన్ నియామకం ఎప్పుడో?

(మొదటిపేజీ తరువాయి)

ముగియక ముందే రాజీనామా చేయడం వివాదస్పదంగా మారింది. దీంతో గవర్నర్ పరిధిలో ఉండాల్సిన రాజ్యాంగబద్ధమైన ఏపీపీఎస్సీ చైర్మన్ నియామకాలు...కేవలం అలంకార ప్రాయంగానే మారాయన్న విమర్శలున్నాయి.

నిలిచిపోయిన నోటిఫికేషన్లు

ఇంతవరకు ఏపీపీఎస్సీ చైర్మన్ నియామకం లేకపోవడంతో ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్లు నిలిచిపోయాయి. నియామకాల ప్రక్రియకు పూర్తిగా ఆటంకం కలగడంతో నిరుద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికే విడుదలైన ఉద్యోగ నోటిఫికేషన్లకు పరీక్షల షెడ్యూలు ప్రకటించలేదు. రాజ్యాంగబద్ధమైన సంస్థకు నాలుగు నెలలపాటు చైర్మన్ లేకపోవడంపై యువజన, నిరుద్యోగ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ప్రకటించిన గ్రూప్-1, గ్రూప్-2 తదితర పరీక్షలను చంద్రబాబు ప్రభుత్వం వాయిదా వేసింది. వాటిని ఎప్పుడు నిర్వహిస్తారనేదీ ప్రశ్నార్థకంగా మారింది. ఏపీపీఎస్సీ పరిధిలో 21 రకాల పరీక్షలు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. లక్షలాది మంది నిరుద్యోగులు శిక్షణ పొందుతూ, నోటిఫికేషన్ల కోసం వేచిస్తున్నారు. ఇప్పటికే వాయిదా వేసిన పరీక్షలతోపాటు విడుదలైన నోటిఫికేషన్లకూ షెడ్యూలు ఇవ్వాల్సి ఉంది. జాబ్ క్యాలెండరులో భాగంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉండి, ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ చేయబోయే అన్ని ఉద్యోగాలకు ప్రకటనలు జారీజేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఏపీపీఎస్సీ చైర్మన్‌గా సమర్థుడైన అధికారిని నియమించాలని కోరుతున్నారు.

హర్యానా సీఎంగా సైనీ ప్రమాణస్వీకారం

(మొదటిపేజీ తరువాయి)

అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్, జేపీ నడ్డా, నితిన్ గడ్కరీ, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ బీజేపీ విజయం సాధించింది. 90 మంది సభ్యులు ఉన్న అసెంబ్లీకి బీజేపీ నుంచి 48 మంది ఎన్నికయ్యారు. అనంతరం సీఎం ఎంపికపై జరిగిన చర్చల్లో... పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకువచ్చిన నాయబ్ సింగ్ సైనీ వైపే అంతా మొగ్గు చూపారు. బుధవారం జరిగిన బీజేపీ శాసనసభా పక్ష భేటీలో ఈ మేరకు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాజీ ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, సీనియర్ నేత అనిల్ విజ్ ఆయన పేరు ప్రతిపాదించగా సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు.

తదుపరి సీజే జస్టిస్ సంజీవ్ ఖన్నా

(మొదటిపేజీ తరువాయి)

తర్వాత జస్టిస్ ఖన్నా అత్యంత సీనియర్‌గా ఉన్నారు. జస్టిస్ డీవై చంద్రచూడ్ పదవీకాలం ఈ ఏడాది నవంబరు 11తో ముగియనుంది. ఆ మరుసటిరోజున అంటే నవంబరు 12న జస్టిస్ ఖన్నా సీజేఐగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. ఆరు నెలల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. వచ్చే ఏడాది మే 13న ఆయన పదవీ విరమణ చేస్తారు.

సెక్షన్ 6ఎ రాజ్యాంగబద్ధమే

(మొదటిపేజీ తరువాయి)

సెక్షన్-6ఎ అనేది చట్టబద్ధమైన మార్గం. ఈ నిబంధనలు రూపొందించడానికి మెజార్టీతో కూడిన పార్లమెంటుకు శక్తి ఉంది. మానవీయ ఆందోళనలు పరిష్కరించడంతోపాటు స్థానికుల ప్రయోజనాలు కాపాడే సమతౌల్యత ఈ సెక్షన్‌కు ఉంది. దీనిలోని కటాఫ్ డేట్‌గా నిర్ణయించిన 1971 మార్చి 25 అనేది సరైనదే. ఎందుకంటే అప్పటికే బంగ్లాదేశ్ యుద్ధం ముగిసింది. బంగ్లాదేశ్ యుద్ధం నేపథ్యంలోనే ఈ సెక్షన్ తీసుకొచ్చిన విషయాన్ని ఇది చెబుతోంది. ఈ సెక్షన్ అంత ఎక్కువగా జనాభాను కలుపుకోలేదు. మరీ తక్కువగాను విలీనం చేసుకోలేదు' అని పేర్కొన్నారు. పౌరసత్వ చట్టం-1955 సెక్షన్6ఎ ప్రకారం... 1966 జనవరి నుంచి 1971 మార్చి 25లోపు అసోం వచ్చిన వలసదారులు పౌరసత్వం కోరవచ్చు. ఈ నిబంధనను 1985లో అసోం ఒప్పందం తర్వాత తీసుకొచ్చారు. అసోంలోకి బంగ్లాదేశ్ వలసలపై ఉద్యమించినవారితో కేంద్రప్రభుత్వం చేసుకొన్న ఒప్పందమే ఇది. దీని చట్టబద్ధతపై అసోంలోని కొన్ని స్థానిక గ్రూపులు న్యాయస్థానంలో సవాలు చేశాయి. ఇది రాజ్యాంగ పీఠికకు విరుద్ధమని, పౌరహక్కుల ఉల్లంఘనగా పేర్కొంటూ రాజకీయ హక్కులను హరించడమేనని వాదించాయి.

తుపాను కల్లోలం

(మొదటిపేజీ తరువాయి)

రోడ్డును అలలు ముంచెత్తాయి. డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు తీరంలో అలలు ఉధృతంగా ఎగసిపడుతున్నాయి. ఓఎన్‌జీసీ ప్లాంటును సముద్రపు నీరు తాకింది. ఆక్వా చెరువులను సముద్రం నీరు ముంచెత్తింది.

జలాశయాలకు భారీ వరద

శ్రీసత్యసాయి జిల్లా సీకే పల్లి మండలం వెల్దుర్తి సమీపంలో చిత్రావతి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో వెల్దుర్తి, గంగినేపల్లి తండాలకు, ఎర్రోనిపల్లి, బ్రాహ్మణపల్లి, చిన్నప్పరెడ్డిపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వైఎస్సార్ జిల్లాలో గండికోట జలాశయం, మైలవరం జలాశయాలకు వరద నీరు వచ్చి చేరుతోంది. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిండుకుండలా మారింది. పైడిపాలెం, వామికొండ, సర్వారాయ సాగర్ జలాశయాలకు వరద వచ్చి చేరుతోంది. నెల్లూరు నగర శివారులోని ఆటోనగర్, చంద్రబాబునగర్, తల్పగిరి కాలనీ, జొన్నవాడ రోడ్డు, పొట్టేపాలెం కలుజు ప్రాంతాల్లో వర్షం కారణంగా రహదారులపై నీరు నిలిచింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో బుధవారం రాత్రి వర్షానికి పంట తడిసింది. ఆరబోసిన మొక్కజొన్న, వేరు శనగ తడిసి రైతులకు నష్టం వాటిల్లింది. వేలాది ఎకరాల్లో వరి పంట నీటమునిగింది.

వర్షాలపై చంద్రబాబు సమీక్ష

రాష్ట్రంలో భారీ వర్షాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లు, ఆయా శాఖల అధికారులతో గురువారం ఉదయం సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత పరిస్థితిని ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల కలెక్టర్లు ముఖ్యమంత్రికి వివరించారు. ఉమ్మడి నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో అనేక ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడినట్లు అధికారులు తెలిపారు. సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి ప్రవాహాలు, చెరువులు, వాగుల పరిస్థితిపై అప్రమత్తంగా ఉండాలని చంద్రబాబు సూచించారు. సాగునీటి ప్రాజెక్టుల్లో ప్రవాహాలు, నీటి నిర్వహణ చర్యలను ఇరిగేషన్ అధికారులు వివరించారు. తీరం దాటిన సందర్భంగా మరో 24 గంటలు భారీ వర్షాలు ఉంటాయనే హెచ్చరిక నేపథ్యంలో పూర్తి అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు.

మరో 24 గంటలు వర్షాలు

చెన్నైకి సమీపంలో వాయుగుండం తీరందాటి ప్రస్తుతం తీవ్ర అల్పపీడనంగా మారిందని, రాగల 24 గంటల్లో కోస్తాంధ్రలో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని విశాఖపట్నం వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. శ్రీకాకుళం, అనకాపల్లి, విశాఖ, విజయనగరం, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని, రాయలసీమలోని అనంతపురం, కడప, చిత్తూరులో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడతాయన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు.

26న 'హెచ్చరిక' ర్యాలీలు

(మొదటిపేజీ తరువాయి)

మరో ఉద్యమం తప్పదనేందుకు ఈ ర్యాలీలను ఓ హెచ్చరికగా ప్రభుత్వం భావించాలని పేర్కొంది. బుధవారం జరిగిన ఎస్‌కేఎం సర్వసభ్య సమావేశంలో వివిధ రైతు సంఘాల నేతలు ఈ నిర్ణయం తీసుకున్నారు. 'కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను ఇప్పటివరకు అమలు చేయకుండా మోసం చేసింది. అందుకే నిరసనగా మేం దేశ వ్యాప్తంగా ఈ ర్యాలీలు చేపట్టాలని నిర్ణయించాం' అని ఏఐకేఎస్ నేత హన్నన్ మొల్లా తెలిపారు. క్రాంతికారి కిసాన్ యూనియన్ అధ్యక్షుడు దర్శన్ పాల్ మాట్లాడుతూ... 'రైతుల డిమాండ్లను నెరవేర్చడంలో జాప్యం చేస్తే... వచ్చే ఏడాది భారీ ఉద్యమాన్ని చేపడతాం. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుంది" అన్నారు. రైతు ఉద్యమం ఉధృతంగా జరిగిన హర్యానాలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తిరిగి బీజేపీ అధికారంలోకి రావడంపై దర్శన్ పాల్ స్పందించారు. అక్కడ బీజేపీ గెలిచినా... దాదాపు 60శాతం ప్రజలు వాళ్లకు వ్యతిరేకంగా ఓటు వేశారని అందులో అత్యధికులు రైతులేనని స్పష్టం చేశారు. కార్మిక, వ్యవసాయ కార్మిక సంఘాలతో పాటు ఎస్‌కేఎం రాష్ట్ర కమిటీల అధ్వర్యంలో నవంబర్ 7 నుంచి 25 వరకు 50 వేల గ్రామాల్లో ప్రచార కార్యక్రమం చేపట్టనున్నట్లు ఎస్‌కేఎం ఈ సందర్భంగా వెల్లడించింది. ప్రతి జిల్లాలో 100 గ్రామాలను కలుపుకుపోయేలా వాహన జాతాలు, పాదయాత్రలు నిర్వహించి తమ డిమాండ్లను ఇంటింటికీ వివరిస్తామని రైతు నేతలు తెలిపారు. సి2+50 శాతం ఫార్ములా ఆధారంగా పంటల కనీస మద్దతు ధర కల్పించడం సహా ఇతర డిమాండ్లు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి ఎస్‌కేఎం మూడు నెలల గడువు ఇచ్చింది. కేంద్రం ప్రకటించిన డిజిటల్ అగ్రికల్చర్ మిషన్‌ను వ్యతిరేకిస్తూ తీర్మానం ఆమోదించింది. జాతీయ సహకార విధానాన్ని ప్రకటించే చర్యను కూడా వ్యతిరేకించింది. సోనమ్ వాంగ్‌చుక్‌తో సహా నిరాహార దీక్ష చేస్తున్న కార్యకర్తలకు ఎస్‌కేఎం సమావేశం సంఘీభావం తెలిపింది. ప్రొఫెసర్ జి.ఎన్. సాయిబాబా మృతికి సంతాపం తెలిపింది.

మద్యం ఆదాయ వనరా?

విశాలాంధ్ర-విజయవాడ: మద్యం వ్యాపారాన్ని ప్రభుత్వం ఆదాయ వనరుగా చూస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నూతన మద్యం పాలసీని అమలులోకి తెచ్చిన సందర్భంగా గురువారం విజయవాడ దుర్గాపురంలోని ఓ మద్యం దుకాణంలో విక్రయాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం మద్యం దుకాణాలన్నింటినీ కేంద్రీకరించటం వల్ల అవినీతి జరిగేదని, ఇప్పుడు వికేంద్రీకరణ చేయటానికి టీడీపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ప్రభుత్వం సరసమైన ధరలకి నాణ్యమైన మద్యం అని చెప్పడంలో అర్థం లేదన్నారు. ధర తక్కువగా ఉన్నా...ఎక్కువగా ఉన్నా మద్యం ఆరోగ్యాన్ని చెడగొట్టేదే కదా అని ఆయన అన్నారు. మద్యం విక్రయాన్ని ప్రభుత్వం ఆదాయ వనరుగా గుర్తించి చాలా సంతోషంగా ఉందన్నారు. దరఖాస్తుల ద్వారా రూ.3వేల కోట్లు వచ్చాయని, డిపాజిట్ ద్వారా మరో రూ.3వేల కోట్లు వస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోందన్నారు. ప్రభుత్వం మద్యం విక్రయం ద్వారా ఆదాయం వస్తుందని భావిస్తోందే కానీ ప్రజాశ్రేయస్సు మాత్రం కాదన్నారు. అదేమంటే సెస్ వస్తుందని... దాన్ని 'రిహాబ్లిటేషన్'కోసం వినియోగిస్తామని చెపుతోందన్నారు. బాగా తాగడం అలవాటు చేసి... తరువాత మందులిచ్చి తాగటం మాన్పిస్తామని చెప్పటం హాస్యాస్పదంగా ఉందని, అడుసుతొక్కనేలా కాలు కడగనేలా అన్న చందంగా ఉందని ఎద్దేవా చేశారు. మద్యం తాగించటం, రక్తం చెడిపోయిన తరువాత మందులిచ్చి బాగుచేయించటం, సెస్ డబ్బులు రిహాబ్లిటేషన్‌కి మళ్లించటం అంతా దండగా మారిన పనేనంటూ ప్రభుత్వ విధానాన్ని దుయ్యబట్టారు. నూతన మద్యం పాలసీ కొత్త సీసాలో పాత సారా చందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా మద్యం ధరలు, ప్రభుత్వ విధానంపై స్థానికుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. నారాయణ వెంట సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి, జి.ఈశ్వరయ్య ఉన్నారు.

ఇవేం ధరలు బాబూ...?

(మొదటిపేజీ తరువాయి)

హయాంలో తక్కువ ధరలో లిక్కర్ క్వార్టర్ రూ.130, రూ.150 రకాలు అందుబాటులో ఉండగా, ఇప్పుడూ అదే రేట్లతో వేరే బ్రాండ్ మద్యం బాటిళ్లను ప్రైవేటు మద్యం షాపుల వారు విక్రయిస్తున్నారు. రూ.99 లకే క్వార్టర్ బాటిల్ అందుబాటులోకి వస్తుందని విస్తృతంగా ప్రచారం జరిగింది కానీ ఆ ధరతో మద్యం ఎక్కడా లభ్యం కావడం రాలేదు. దీంతో పేద వర్గాలకు చెందిన మందుబాబులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే కావాల్సిన బ్రాండ్‌లు లభిస్తుండటంపై మరి కొందరు సంతోషిస్తున్నారు. విస్కీ బ్రాండ్‌లలో క్వార్టర్ 180 ఎంఎల్ ప్రారంభ ధర రూ.130లు ఉండగా, బ్రాందీలో క్వార్టర్ 180 ఎంఎల్ రూ.120ల నుండి నుంచి లభిస్తున్నాయి. రమ్‌లో తక్కువ ధరలో క్వార్టర్ రూ.230లు ఉండగా, ఓడ్కా క్వార్టర్ ధర రూ.230లు నిర్ణయించారు. బీర్‌ల విషయానికి వస్తే రూ.180ల నుంచి రూ.270 వరకూ నిర్ణయించారు. కొత్తగా ఏర్పాటైన షాపుల వద్ద మందుబాబులు రూ.99ల క్వార్టర్ బాటిళ్లు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయని దుకాణదారులను ప్రశ్నిస్తున్నారు. దీనికి వారి నుండి సమాధానం లభించడం లేదు. మరో పక్క వైసీపీ ప్రభుత్వంలో చాలా ప్రాంతాల్లో ప్రభుత్వ మద్యం దుకాణాలు నివాస ప్రాంతాలకు దూరంగా ఏర్పాటు చేశారు. అయితే ఇప్పుడు ప్రైవేటు మద్యం దుకాణాలు కావడంతో గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, నివాస ప్రాంతాల మధ్యకు వచ్చేశాయి. నివాస ప్రాంతాల్లోని రద్దీ ప్రదేశాల్లో మద్యం షాపులను ఏర్పాటు చేయడంపై కొన్ని ప్రాంతాల్లో మహిళలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

రూ.99 క్వార్టర్ మద్యం కేసులు వచ్చేశాయ్: నిషాంత్‌కుమార్

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా రూ.99లకు క్వార్టర్ బాటిల్ మద్యం అందుబాటులోకి వచ్చిందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ సంచాలకులు నిషాంత్ కుమార్ తెలిపారు. మద్యం తయారీ, విక్రయాల్లో జాతీయ స్థాయిలో పేరున్న 5 సంస్థలు ఆంధ్రప్రదేశ్‌లో ఈ ధరకు మద్యం విక్రయాలు చేసేందుకు సిద్ధం అయ్యాయన్నారు. గురువారం నాటికి పది వేల కేసుల రూ.99 మద్యం మార్కెట్‌కు చేరిందని, సోమవారానికి రోజువారీ సరఫరా 20వేల కేసులకు చేరుతుందని వివరించారు. దశల వారీగా సరఫరా పెరిగి ఈ నెలాఖరు నాటికి 2,40,000 కేసుల చౌక మద్యం రాష్ట్రంలో అందుబాటులో ఉంటుందని వివరించారు. ఈ క్రమంలో మొత్తంగా కోటి ఇరవై లక్షల క్వార్టర్ సీసాల మద్యం ఈ నెలలో అందుబాటులోకి రానుందన్నారు. వినియోగాన్ని అనుసరించి తదుపరి నెలలలో ఏ మేరకు దిగుమతి చేసుకోవాలన్న దానిపై నిర్ణయం తీసుకుంటామని నిషాంత్ కుమార్ వివరించారు.

ట్రంప్ కన్నా హారిస్ ఉత్తమం

(మొదటిపేజీ తరువాయి)

మాకు బైడెన్ ప్రభుత్వంతో విభేదాలు ఉన్నాయి. అయితే ట్రంప్ అధికారంలో ఉన్నప్పుడు చైనాకు వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయాల ప్రభావం బైడెన్ ప్రభుత్వంలోనూ కొనసాగుతున్నాయి. అయినప్పటికీ బైడెన్ నేతృత్వంలో చైనా పట్ల అమెరికా విధానం స్థిరంగా ఉంది. ఇరు దేశాల నేతలు భేటీ అవుతున్నారు. సమస్యల పరిష్కారంపై చర్చలు జరుపుతున్నారు" అని జియా కింగ్‌గో పేర్కొన్నారు. "ట్రంపా, హారిసా అనే విషయంలో చైనా పౌరుల ఉద్దేశాలు వేర్వేరుగా ఉండొచ్చు. నా వరకు హారిస్ వస్తే బాగుంటుంది. ట్రంప్‌తో ఇది వరకే చేదు అనుభవం ఉంది. మరోసారి ఆ పరిస్థితిని కోరుకోవడం లేదు" అని పేర్కొన్నారు. కాగా.. కరోనా మహమ్మరి చైనా నుంచే పుట్టుకొచ్చిందంటూ నాడు ట్రంప్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఆ ఆరోపణలను చైనా ఖండించింది. చైనా నుంచి దిగుమతులపై ట్రంప్ భారీగా సుంకాలు విధించారు. బైడెన్ ప్రభుత్వం అవే సుంకాలను కొనసాగిస్తున్నప్పటికీ చైనా వస్తువులపై మరింత సుంకాన్ని విధిస్తామని ట్రంప్ పేర్కొన్నారు.

పెట్టుబడులకు స్వర్గధామం

(మొదటిపేజీ తరువాయి)

సదుపాయాలు ఏపీకి ఉన్న ప్రత్యేక అర్హతలుగా పేర్కొన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తమ ప్రభుత్వం పారిశ్రామికవేత్తలతో చర్చించి కొత్త పాలసీలు తీసుకొచ్చినట్లు వెల్లడించారు. కొత్త పాలసీలు వేగవంతమైన వ్యాపార నిర్వహణకు దోహదం చేస్తాయన్నారు. తాము దేశంలో అత్యుత్తమ వ్యాపార వాతారణ వ్యవస్థను నిర్మిస్తున్నామన్నారు. రాష్ట్రంలో మీ వ్యాపారానికి ప్రభుత్వం పూర్తి సహాయసహకారాలు అందిస్తుందని తాను వ్యక్తిగతంగా హామీ ఇస్తున్నానని, రాష్ట్రంలో పెట్టుబడులతో మీ వ్యాపారం పెరుగుతుందని హామీ ఇచ్చారు.

మోదీ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ

రాజకీయ ఖైదీల విడుదలకు సీపీఐ నిరసన దీక్ష

విశాలాంధ్ర-హైదరాబాద్: దేశంలో ప్రజాస్వామ్యాన్ని కూల్చేసేవిధంగా మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తుందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. ఉపా చట్టంతో దుర్మార్గమైన హింసాకాండను అమలుచేస్తుందని మండిపడ్డారు. ప్రజాస్వామిక వాదులంతా ఏకతాటిపైకి వచ్చి జాతీయస్థాయిలో ఉపా చట్టానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సీపీఐ హైదరాబాద్ జిల్లా సమితి అధ్వర్యంలో గురువారం ఇందిరా పార్కు వద్ద ఉపా చట్టాన్ని రద్దు చేయాలని, రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన దీక్ష చేపట్టారు. వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలచేత ఎన్నుకోబడిన ప్రభుత్వం వారికోసం పాటుపడాలన్నారు.

90 శాతం దివ్యాంగుడైన ప్రొఫెసర్ సాయిబాబాపై కేసులు పెట్టి ఆయనను దుర్మార్గంగా పదేళ్లు జైల్లో పెట్టిందన్నారు. పౌరస్మృతి చట్టాలను తెచ్చి, ప్రశ్నించే గొంతులను ఉపా చట్టంతో మోదీ ప్రభుత్వం అణచి వేస్తుందన్నారు. 10 ఏళ్ల మోదీ పాలనలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. రాజ్యాంగాన్ని మార్చాలని కుట్ర చేస్తున్నారని అన్నారు. రాజ్యాంగ హక్కులు అమలు చేయడం లేదన్నారు. గౌరీ లంకేశ్ వంటి వాళ్లను ఫాసిస్టు శక్తులు చంపేస్తున్నాయని అన్నారు. వరవరరావు పరిస్థితి ఘోరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కమ్యూనిస్టులను అణచివేయాలని ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. నియంతృత్వం ఉన్నంత వరకు దేశంలో కమ్యూనిజం ఉంటుందన్నారు. ప్రజాస్వామిక వాదులంతా ఒకే వేదికపైకి రావాలని, మోదీ మెడలు వంచి, ఉపా చట్టం రద్దు చేసేంత వరకూ పోరాడాలని పిలుపునిచ్చారు.

ఉపా దుర్మార్గమైన చట్టం: ప్రొఫెసర్ హరగోపాల్

ఉపా చట్టానికి టైమ్ ఫ్రేమ్ లేదని, ట్రయల్... బెయిల్ ఉండదని, దుర్మార్గమైన చట్టమని ప్రొఫెసర్ హరగోపాల్ విమర్శించారు. ఉపా చట్టం కింద అరెస్టు అయిన వారిలో కేవలం మూడు శాతం వరకే నేరాలు నిరూపించారని, 97 శాతం నిరూపణ కాలేదన్నారు. బీమా కోరేగామ్ కేసులో ట్రయల్ ప్రారంభం కాలేదన్నారు. వరవరావును జైల్లో పెట్టారన్నారు. సాయిబాబాను పదేళ్లు జైల్లో పెట్టారన్నారు. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా చాలా ప్రయత్నాలు చేశారని చెప్పారు. దివ్యాంగుడు సాయిబాబాను సెల్‌లో నిర్బంధించి, తీవ్రంగా హించారని ఆవేదన వ్యక్తం చేశారు. సాయిబాబా మరణానికి కారణం ఎవరని ప్రశ్నించారు. దేశంలో 300 లక్షల సంపద ఉంటే, 20 కోట్ల మంది ఆకలితో ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ఉపా చట్టానికి స్థానం లేదన్నారు. ఉపా చట్టం ఉంటే ప్రజాస్వామ్యం లేదన్నారు. ఉపా చట్టం రద్దు అయ్యేంత వరకు పోరాటం కొనసాగించాలని హరగోపాల్ పిలుపునిచ్చారు.

అధికార పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే కేసులే: ఈటీ నరసింహ

అధికార పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే ఉపా చట్టాల కింద కేసులు పెడుతున్నారని, ఈ కేసుల్లో ఆరు నెలల వరకు కనీసం కేసు విచారణకు స్వీకరించారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈటీ నరసింహ అన్నారు. ప్రొఫెసర్ సాయిబాబా జైల్లోకి వెళ్లే ముందు ఆరోగ్యంగా ఉన్నారని, పదేళ్ల కు జైల్ నుంచి విడుదలైన తరువాత ఆయనకు 19 రకాల అనారోగ్య సమస్యల వచ్చాయన్నారు. ఆయనపై మోపిన అభియోగాలు నిరూపణ కాకపోవడంతో విడుదలయ్యారన్నారు. జైల్లో అనారోగ్యానికి గురయ్యే సాయిబాబా మరణించారని అన్నారు. దీనిపై ప్రజాస్వామిక వాదులు ఆలోచన చేయాలన్నారు. ఉపా చట్టంతో అమాయకులు జైళ్లలో మగ్గుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకొని, మతాల మధ్య విభజన తేవడమే బీజేపీ పని అని విమర్శించారు. ప్రజాస్వామిక వాదులందరూ ఏకమై బీజేపీని అడ్డుకోవాలన్నారు.

ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల కోసం పోరు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్‌లు అమలు జరిగితేనే అణగారిన వర్గాలకు న్యాయం జరుగుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ఇందుకోసం ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం 'ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల చట్టం' అంశంపై సోషలిస్టు జనతా కాంగ్రెస్ కూటమి సదస్సు నిర్వహించింది. కూటమి జాతీయ చైర్మన్ ఎల్.జై బాబు అధక్షత వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ అణగారిన వర్గాలకు బీఆర్ అంబేద్కర్ రిజర్వేషన్‌లు కల్పించారని, దానివలన ప్రభుత్వరంగ సంస్థలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర వెనుకబడిన వర్గాలకు కొంత ప్రయోజనం కలిగిందన్నారు. అయితే కొంతకాలం నుండి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయడం లేదని విమర్శించారు. ఆర్థికభారాలు తమపై లేకుండా ప్రభుత్వాలు రిజర్వేషన్ల నుంచి పక్కకు తప్పుకుంటున్నాయన్నారు. ఎన్నో పోరాటాలు చేసి ప్రాణత్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటుపరం చేయడం వెనుక దురుద్దేశం ఉందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం ద్వారా ఉద్యోగాలు కల్పించే బాధ్యత నుంచి తప్పుకుంటున్నాయని, ప్రైవేటు సంస్థలు తమకు ఇష్టమొచ్చిన వారిని నియమించుకున్నాయని ఆరోపించారు. ఈ ప్రకియలో రిజర్వేషన్లకు తావు లేకుండా పోయిందన్నారు. రిజర్వేషన్లను పూర్తిగా తొలగించడమే మోదీ ప్రభుత్వం లక్ష్యంగా కనిపిస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వరంగంలో ఉద్యోగాలు లేకపోవడంతో ప్రైవేట్‌రంగంలో ఉద్యోగాల డిమాండ్ తెరపైకి వచ్చిందని వివరించారు. రాబోయే రోజుల్లో విజయవాడలోనే కాకుండా హైదరాబాద్, చెన్నై, ఢిల్లీ వరకు ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవాలని, సామాజికన్యాయం కాంక్షిస్తున్న అన్నిపార్టీలోని దళిత నేతలు, మేధావులు, బడుగు బలహీనవర్గాల ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కులగణన తప్పనిసరిగా చేయాలని డిమాండ్ చేశారు. జైబాబు మాట్లాడుతూ ప్రైవేట్ రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగాల్లో ఉద్యోగాలు అందని ద్రాక్షగా మారాయని, దాంతో అనేక మంది ఉద్యోగ అవకాశాల కోసం ప్రైవేట్ రంగం వైపు చూస్తున్నారన్నారు. ప్రైవేట్ రంగాల్లో రిజర్వేషన్ల చట్టం తీసుకురావాలని, అందుకోసం అన్ని పార్టీలు పార్లమెంట్‌లో డిమాండ్ చేయాలని కోరారు. నగర మాజీ మేయర్ తాడి శకుంతల మాట్లాడుతూ రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పటి నుంచి రిజర్వేషన్లు సక్రమంగా అమలు కాలేదన్నారు. చాలావర్గాలు ఇప్పటికీ రిజర్వేషన్లకు దూరంగా ఉన్నాయన్నారు. సమావేశంలో దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప, దళిత బహుజన రాష్ట్ర నాయకులు జుజ్జువరపు రవి ప్రకాశ్, మానవ హక్కుల పరిరక్షణ సమితి నాయకులు గద్దల ఆదాం, గోరింత అప్పలరాజు, కూటమి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓర్సు వీరభాస్కర్, దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు అంగడాల పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఈడీలకు సత్కారం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీఎస్‌ఆర్టీసీలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల(ఈడీ)ను ఎంప్లాయిస్ యూనియన్ సత్కరించింది. ఆర్టీసీ హౌస్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఈడీలు జీవీ రవివర్మ, టి.చెంగల్‌రెడ్డి, ఆర్థిక సలహాదారు ఎస్.సుధాకర్‌ను యూనియన్ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య తదితరులు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. ఉద్యోగుల సమస్యలను వారితో చర్చించారు. ఉద్యోగ భద్రతపై 2019లో ఇచ్చిన సర్క్యులర్ నంబరు-01/2019ను యథాతథంగా అమలు చేసి, ఉద్యోగులను ప్రశాంతంగా ఉద్యోగాలు చేసుకునేలా కిందిస్థాయి అధికారులకు ఆదేశాలివ్వాలని కోరారు. 2022 నుంచి నిలుపుదల చేసిన నైట్ హాల్టు/డైలీ అలవెన్సుల జీవో-114 ప్రకారమే ప్రభుత్వ ఉద్యోగుల తరహాగా చెల్లించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. పెండింగ్‌లో పడిన పదోన్నతులపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాని కారణంగా దాదాపు మూడువేల మంది పదోన్నతులు ఆగిపోయాయని వివరించారు. రిటైర్డు ఎంప్లాయిస్ మెడికల్ స్కీమ్ (ఆర్ఈఎంఎస్) విలీనానికి ముందున్న పద్ధతిలోను, పెండింగ్‌లో ఉన్న 2017 పీఆర్సీ బకాయిలు, ఆర్‌బీఎస్, ఎస్‌బీటీ స్కీమ్‌లు అమలయ్యేలా చూడాలని కోరారు. ఈయూ రాష్ట్ర నాయకులు ఎండీ ప్రసాద్, ఎండీఏ సిద్దిక్, టీవీ భవాని, మందపాటి, శంకరరావు, ఎస్.ఎస్.నారాయణ, జీఎస్ నారాయణ, ఎన్‌సీహెచ్ చక్రవర్తి, జోనల్ కార్యదర్శి వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీపీఐ సభ్యుడు జాన్ మృతి

ముప్పాళ్ల, జంగాల సంతాపం

విశాలాంధ్ర-తాడికొండ: గుంటూరు జిల్లా పొన్నెకల్లు గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకులు షేక్ జాన్ సాహెబ్(80) గురువారం ఉదయం గుండెపోటుతో మరణించారు. 1962 నుంచి తుది శ్వాస విడిచే వరకు ఆయన సీపీఐతోనే ఉన్నారు. తాడికొండ పరిసరాలలో డాక్టర్ జాన్, కాంపౌండర్ జాన్‌గా అందరికీ సుపరిచితులు. మహాసభలు, ఎన్నికల ప్రచారం, మైక్ ప్రచారంలో జాన్ ముందుంటారు. విషయం తెలుసుకున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్... జాన్ భౌతికకాయంపై పార్టీ జెండా కప్పి జోహార్లు అర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గొప్ప నాయకుడిని సీపీఐ కోల్పోయిందని ముప్పాళ్ల అన్నారు. జాన్‌కు కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య కొంతకాలం క్రితం మరణించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పచ్చల సాంబశివరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు గుర్రంకొండ సత్యానందం, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివశంకరరావు, తాడికొండ ఏరియా కౌన్సిల్ సభ్యుడు రేపూడి శ్రీనివాసరావు, సీపీఎం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు, మాజీ జడ్పీటీసీ పల్లా శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి షేక్ జాన్, షేక్ సైదా, కె.శివయ్య, ముప్పాళ్ల కిరణ్, హరిబాబు, ఎస్‌కే బాబు నివాళి అర్పించారు.

నాకేమీ తెలియదు

'సజ్జల' పొంతనలేని సమాధానాలు
దర్యాప్తునకు సహకరించలేదు: సీఐ

విశాలాంధ్ర-మంగళగిరి: టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ఎట్టకేలకు గురువారం మంగళగిరి పోలీస్‌స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. ఈ కేసులో నిందితులు ఇచ్చిన సమాచారం ఆధారంగా సజ్జలకు పోలీసులు నోటీసులు జారీజేశారు. సజ్జలతోపాటు మాజీ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, వైసీపీ నేతలు పోలీసు స్టేషన్‌కు వచ్చారు. ఆ సమయంలో పోలీసులకు, పొన్నవోలుకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. కేవలం సజ్జలను మాత్రమే పంపాలని ఉన్నతాధికారులు చెప్పినట్లు పోలీసులు చెప్పగా... వారితో పొన్నవోలు వాదించారు. అనంతరం సజ్జల విచారణకు హాజరయ్యారు. ఈ కేసు విచారణలో భాగంగా 38 ప్రశ్నలు సంధించగా... తనకేమీ తెలియదని, గుర్తులేదని చెప్పారని, విచారణకు సజ్జల సహకరించలేదని సీఐ శ్రీనివాసరావు తెలిపారు. జగన్ హయాంలో ప్రభుత్వ సలహాదారుడిగా సజ్జల ఉన్నారని, తమ వద్ద ఉన్న ఆధారాలతో ఆయనను ప్రశ్నించామని, సజ్జలను ఫోన్ అడిగినా ఇవ్వలేదని, విచారణకు ఆయన సహకరించలేదని చెప్పారు. ఈ కేసులో ఆయన పాత్ర ఉన్నట్లు తమ వద్ద ఆధారాలున్నాయని తెలిపారు.

ఇది రాజకీయ కక్ష: సజ్జల

వైసీపీ నేతలపై టీడీపీ కక్షపూరిత చర్యలకు దిగుతోందని సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు. విచారణ అనంతరం సజ్జల మీడియాతో మాట్లాడుతూ విపక్షం లేకుండా చేయాలని టీడీపీ కూటమి ప్రభుత్వం భావిస్తోందని ఆరోపించారు. వైసీపీకి సీట్లు తక్కువ వచ్చినా...40 శాతం ఓట్లు సాధించిన విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. ఎన్నికల హామీల అమలు నుంచి ప్రజల దృష్టి మళ్లించడం కోసమే కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. పోలీసుల దర్యాప్తు పారదర్శకంగా జరగడం లేదన్నారు. 2019 నుంచి తాము కక్షపూరితంగా వ్యవహరిస్తే టీడీపీ నాయకులు చాలా ఇబ్బంది పడేవారని, ఇప్పటికైనా టీడీపీ ప్రభుత్వం ఇలాంటి పనులు మానుకోవాలని తెలిపారు. ఈ కేసులో రోజురోజుకు నిందితుల సంఖ్య పెంచుకుంటూ వెళ్తున్నారని సజ్జల అన్నారు. ఘటన జరిగిన రోజు తాను ఇక్కడ లేనని, ఇదే విషయాన్ని పోలీసులకు చెప్పానన్నారు. టీడీపీ కార్యాలయంపై దాడితో తనకు ఏ మాత్రం సంబంధం లేదన్నారు. పూర్తి వివరాలను విచారణ అధికారులకు వెల్లడించినట్లు సజ్జల తెలిపారు.

టీడీపీ నేత మురళీకృష్ణంరాజు వైసీపీలో చేరిక

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కాకినాడ జిల్లాలో టీడీపీకి ఊహించని షాక్ తగిలింది. ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర కార్యదర్శి ముదునూరి మురళీకృష్ణంరాజు టీడీపీకి రాజీనామా చేశారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ సమక్షంలో గురువారం ఆయన పార్టీలో చేరారు. పార్టీ కండువా కప్పి ఆయనను జగన్ ఆహ్వానించారు. ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఉన్నారు.

రాజ్యాంగానికి విరుద్ధం సనాతన ధర్మం

చరిత్ర విశ్లేషకుడు కొప్పర్తి విమర్శ

తణుకు: రాజ్యాంగాన్ని భారత ప్రజలు రూపొందించుకుని తమకు తాము సమర్పించుకున్న ప్రజాస్వామిక హక్కుల పత్రమని, అదేసమయంలో ప్రజల హక్కులను కాలరాయడానికి, సామాజిక వివక్షను స్థిరపరచడానికి ప్రజల ప్రమేయం లేకుండా వారి మీద రుద్దబడిందే సనాతనధర్మమని ప్రముఖ కవి, చరిత్ర విశ్లేషకులు కొప్పర్తి వెంకటరమణ మూర్తి చెప్పారు. తణుకు సురాజ్య భవనంలో 'రాజ్యాంగం-సనాతనధర్మం'పై ప్రజాసంఘాల అధ్వర్యంలో గురువారం చర్చాగోష్ఠి జరిగింది. కొప్పర్తి వెంకట రమణమూర్తి మాట్లాడుతూ సనాతనధర్మాన్ని పాటించడమంటే వర్ణాశ్రమ ధర్మాన్ని, కుల వ్యవస్థని, మనుధర్మాన్ని ఆచరించడమేనని పేర్కొన్నారు. ఇది రాజ్యాంగ విలువలకు, ప్రజాస్వామిక స్ఫూర్తికి విరుద్ధమైనదని ఆయన స్పష్టంచేశారు. రాజ్యాంగం ముందు చూపునిస్తుండగా... మనువాద సనాతనధర్మం అంధయుగాలకు నడిపిస్తుందని, సమాజాన్ని వెనకకు నడిపించే ప్రయత్నాలను అందరూ ప్రతిఘటించాలని కొప్పర్తి పిలుపు ఇచ్చారు. గోష్ఠికి అధ్యక్షత వహించిన దారిదీపం సంపాదకులు డీవీవీఎస్ వర్మ మాట్లాడుతూ ప్రజలు మతవిశ్వాసం కలిగి ఉండే స్వేచ్ఛను రాజ్యాంగం కల్పించిందన్నారు. రాజ్యాం గం మీద ప్రమాణం చేసి ఉన్నత పదవులు చేపట్టిన నాయకులు రాజ్యాంగ విరుద్ధమైన, వివక్షాపూరితమైన సనాతన ధర్మప్రచారకులుగా మారడం అభ్యంతరకరమన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన ముందున్న అవకాశాలలో ఒకదానిని ఎంచుకో వాలని హితవు పలికారు. రాజ్యాంగ పదవిలో కొనసాగడమా... సనాతన ధర్మ ప్రచారకుడిగా ఉండటమా తేల్చుకోవాలని డిమాండ్ చేశారు. సామాజిక న్యాయ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు పేరూరి మురళీకుమార్ మాట్లాడుతూ సనాతన ధర్మానికి పట్టుగొమ్మగా కులవివక్షను స్థిరీకరణ చేసిన మనుస్మృతిని డా.అంబేద్కర్ దహనం చేశారని గుర్తు చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ సనాతనధర్మం ముసుగులో నిచ్చెన మెట్ల కులవ్యవస్థను తిరిగి తీసుకొచ్చే కుట్రలను ప్రతిఘటించాలని కోరారు. సీపీయం నాయకులు పి.మునిస్వామి, సామాజిక ఉద్యమ నాయకురాలు సంకు మనోరమ మాట్లాడారు. మునిసిపల్ మాజీ ఛైర్మన్ ఆకుల వెంకటేశ్వరావు, డా.రమేశ్ చంద్రబాబు, అంబేద్కర్, పొట్ల సురేశ్, కౌరు వెంకటేశ్వర్లు, మధు, బొద్దాని నాగరాజు, గార ప్రసాద్, నామన వెంకటేశ్వరరావు, నీలం మాల్యాద్రి, పి.అప్పలస్వామి, అబ్రహాం, వనమాడి శ్రీధర్, కొండే నాగేశ్వరరావు, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్'లేవి బాబూ!

- ఉద్యోగాల కల్పనపై శ్వేతపత్రాల విడుదల
- మద్యంలో జగన్, బాబుకు తేడా లేదు
- ఎంపీలంతా మోదీకి ఊడిగం: షర్మిల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మంత్రివర్గ సమావేశంలో సూపర్ సిక్స్‌లో... ఒక్క సిక్స్ అయినా అమలు చేస్తారని ఆశించిన ప్రజలను సీఎం చంద్రబాబు దగా చేశారని, బాబు సూపర్ సిక్స్‌లు గాలికి కొట్టుకుపోయాయని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల మండిపడ్డారు. మహిళ లకు శుభవార్త చెబుతారని అనుకున్నామని, ఉచిత సిలిండర్లు, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ఊసే లేదన్నారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, పాతవి పక్కనపెట్టి... కొత్తగా సిక్స్ పాలసీలు తెచ్చారని మండిపడ్డారు. కొత్త పరిశ్రమలు వస్తే మంచిదేనని, పెట్టుబడులు రావాలని, ఉద్యోగాలు రావాలన్నారు. 30 లక్షల కోట్ల పెట్టుబడులు తెస్తామని, 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. జాబ్ ఫస్ట్ అనే నినాదమని బాబు చెప్పాడని, ఇవన్నీ అమలు చేసే చిత్తశుద్ధి ఆయనకు ఉందా? అని ప్రశ్నించారు. పాత సినిమాకి కొత్త టైటిల్ పెట్టాడని దుయ్యబట్టారు. రాష్ట్రంలో నిరుద్యోగం తారా స్థాయిలో ఉందని, యువత వలసలు పోతున్నారని చెప్పారు. నిరుద్యోగులు 50 లక్షల మంది ఉన్నారని, బాబు చెప్పినట్లుగా...ఏడాదికి నాలుగు లక్షల ఉద్యోగాలు ఇస్తే...ఐదేళ్లలో 20 లక్షల మందికే ఇస్తారని తెలిపారు. మరి మిగతా వాళ్ల సంగతేమిటని ఆమె ప్రశ్నించారు. ఒక్క ఉద్యోగం ఇవ్వని మోదీకి చంద్రబాబు ఎందుకు మద్దతిస్తున్నారని, మోదీ, బాబు కలిసి ఉద్యోగాల కల్పనపై శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం అన్ని పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న 25 మంది ఎంపీలు మోదీకి ఊడిగం చేస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని తిరుపతిలో మోదీ చెప్పారని, నాటి మాట ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. లిక్కర్ విషయంలో జగన్‌కి, బాబుకి పెద్ద తేడా లేదని విమర్శించారు. కాంగ్రెస్ విజయవాడ నగర అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు, పీసీసీ మైనార్టీ సెల్ చైర్మన్ రాధా గాంధీ, మాజీ ఎమ్మెల్యే మస్తాన్ వలీ, బొర్రా కిరణ్ పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్ కళాశాల స్థలం కాపాడుకుందాం

ఎమ్మెల్యే బోండా ఉమ

విశాలాంధ్ర-విజయవాడ: విజయవాడలో ప్రముఖ ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాలకు చెందిన స్థలాన్ని కొందరు కబ్జా చేశారని, ఆ స్థలాన్ని కాపాడుకోవటం కోసం కళాశాల పూర్వ విద్యార్థులు సాగిస్తున్న పోరాటానికి తాను అండగా ఉంటానని విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యుడు బోండా ఉమా మహేశ్వరరావు హామీ ఇచ్చారు. కళాశాలకు చెందిన స్థలం తమదంటూ కబ్జాదారులు పత్రికాముఖంగా చెప్పటాన్ని పూర్వ విద్యార్థులు గురువారం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే బోండా ఉమ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యేగా కళాశాల స్థలాన్ని కాపాడటంలో పూర్వ విద్యార్థులు, కళాశాల యాజమాన్యం చేసే పోరాటానికి పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ కళాశాల స్థలాన్ని భవిష్యత్ తరాల అవసరం కోసం రక్షించుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. అనంతరం ఎస్ఆర్ఆర్ కళాశాలకు చెందిన స్థలాన్ని కాపాడాలని కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు ఎన్టీఆర్ జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి సంఘ నాయకులు దోనేపూడి శంకర్, వెలగా జోషి, సంఘం అధ్యక్షుడు లంక జానయ్య, కార్యదర్శి చిగురుపాటి యుగంధర్, ఉపాధ్యక్షుడు ఆళ్ల వేణుగోపాలరావు తదితరులు ఉన్నారు.

కుక్కల విద్యాసాగర్ పిటిషన్‌లపై విచారణ వాయిదా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బాలీవుడ్ నటి కాదంబరీ జెత్వానీ నుంచి స్వాధీనం చేసుకున్న ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను భద్రపరచాలని కుక్కల విద్యాసాగర్ వేసిన వ్యాజ్యంపై గురువారం హైకోర్టులో విచారణ జరిగింది. కేసు దర్యాప్తును సీఐడీకి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని అడ్వొకేట్ జనరల్ న్యాయస్థానానికి వివరించారు. కౌంటర్ దాఖలు చేసేందుకు సమయం కావాలని ఏజీ ధర్మాసనాన్ని కోరారు. వాదనలు విన్న హైకోర్టు తదుపరి విచారణను ఈ నెల 23కి వాయిదా వేసింది. మరోవైపు అరెస్ట్‌తో పాటు విజయవాడ కోర్టు ఇచ్చిన రిమాండ్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ కుక్కల విద్యాసాగర్ హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపైనా గురువారం న్యాయస్థానం విచారణ చేపట్టింది. పిటిషన్ తేలే వరకు బెయిల్ పిటిషన్ విచారణకు ట్రయల్ కోర్టును ఒత్తిడి చేయబోమని ఆయన తరపు న్యాయవాది ధర్మాసనానికి వివరించారు. కింది కోర్టులో జరగనున్న విద్యాసాగర్ కస్టడీ పిటిషన్‌పై విచారణకు ఒత్తిడి చేయబోమని పోలీసులు హైకోర్టుకు హామీ ఇచ్చారు. అనంతరం తదుపరి విచారణను ఈ నెల 22కి వాయిదా వేసింది.

29 వరకు రిమాండ్ పొడిగింపు

కాగా, కాదంబరీ జత్వానీ కేసులో నిందితుడు కుక్కల విద్యాసాగర్‌కు రిమాండ్ పొడిగిస్తూ విజయవాడ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. విజయవాడ నాలుగో ఏసీఎంఎం కోర్టు ఈ నెల 29 వరకు రిమాండ్ పొడిగించింది. గురువారంతో రిమాండ్ గడువు ముగుస్తుండటంతో పోలీసులు నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. సినీనటి జత్వానీపై అక్రమంగా కేసు నమోదు చేసిన వ్యవహారంలో ఇబ్రహీంపట్నం పోలీసులు ఇటీవల కుక్కల విద్యాసాగర్ సహా మరికొందరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసులో కుక్కల విద్యాసాగర్‌ను ఏ1గా చేర్చి పోలీసులు అరెస్టు చేయగా, ప్రస్తుతం విజయవాడ జిల్లా జైల్‌లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

జమిలి ఎప్పడొచ్చినా సిద్ధం

గాడి తప్పిన చంద్రబాబు పాలన: జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జమిలి ఎన్నికలు ఎప్పుడొచ్చినా తాము సిద్ధమని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. దేశంలోనే బలమైన పార్టీగా ఎదగాలని, వ్యవస్థీకృత నిర్మాణంతోనే అది సాధ్యమని పార్టీ శ్రేణులకు జగన్ దిశానిర్దేశం చేశారు. వైసీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను గురువారం నిర్వహించారు. దీనికి హాజరైన పార్టీ జిల్లా అధ్యక్షులు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులనుద్దేశించి జగన్ మాట్లాడారు. క్షేత్రస్థాయి నుంచి పార్టీ నిర్మాణం పటిష్టంగా ఉండాలని జగన్ సూచించారు. గ్రామస్థాయిలో అనుబంధ విభాగాలను ఏర్పాటు చేయాలని, పార్టీ నిర్మాణంలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ప్రజల కోసం పార్టీ పిలుపునిస్తే ఉవ్వెత్తున స్పందించేలా ఉండాలని, ఇప్పుడు కష్టపడే వాళ్లకే అవకాశాలు, పదోన్నతులు వస్తాయన్నారు. లోటుపాట్లు సరిదిద్దుకోవడానికి ఇదే సరైన సమయమని, పార్టీ నాయకుల పనితీరుపై ఎప్పటికప్పుడు నివేదికలు వస్తాయన్నారు. చంద్రబాబు ప్రభుత్వం నాలుగు నెలల్లోనే అన్ని రంగాల్లో విఫలమైందని, ఈ ప్రభు త్వంపై అప్పుడే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. ఇంత దారుణమైన ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదని, ఎన్నికల హామీలకు, ఈ పాలనకు సంబంధమే లేదని జగన్ తూర్పారబట్టారు. నాడు ఎన్నికల హామీలన్నీ వైసీపీ ప్రభుత్వం పక్కాగా అమలు చేయగా... ఈ ప్రభుత్వం ఏ ఒక్క హామీ నిలబెట్టుకోలేదన్నారు. ప్రతి పక్షంలో ఉన్నప్పుడు తగిన సమయం ఉంటుందని, పార్టీని మరింత పటిష్టం చేయడానికి మంచి అవకాశముంటుందని నేతలకు జగన్ సూచించారు. రాష్ట్రంలో పరిపాలన గాడి తప్పిందని, పోలీసులు దొంగ కేసులకు పరిమితమయ్యారని, దిశ యాప్ ఏమైందో తెలియడం లేదన్నారు. పోలీసులు విధులు మరచి, మూడు సింహాలకు సెల్యూట్ కాకుండా రాజకీయ నాయకులకు మడుగులొత్తుతున్నారని ధ్వజమెత్తారు. ఇసుక టెండర్లు పిలుస్తున్నామన్న విషయం ఎవరికీ తెలియదని, కనీసం రెండు రోజులే గడువు మిగిలిందన్నారు. ఏం కావాలన్నా మళ్లీ జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిం దని, ఇప్పటికే లక్షన్నర పెన్షన్లు తొలగిం చారన్నారని విమర్శించారు. గ్రామస్థాయిలో పార్టీకి బలమైన నాయకత్వం ఉందని, పార్టీ నాయకులు ఎక్కడికక్కడ జనంతో మమేకం కావాలని, అన్యాయంపై స్పందించాలని, బాధితులకు అండగా నిలవాలని జగన్ కోరారు.

వాల్మీకి మహర్షికి జగన్ నివాళి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వాల్మీకి మహర్షికి మాజీ సీఎం జగన్ నివాళులర్పించారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం వాల్మీకి జయంతిని నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి జగన్ పూలమాలలేసి శ్రద్ధాంజలి ఘటించారు.

సచివాలయంలో గుండెపోటు నివారణ ఇంజక్షన్లు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాష్ట్ర సచివాలయం సివిల్ డిస్పెన్సరీలో గుండెపోటు నివారణ ఇంజక్షన్ టెనెక్టెప్లేస్ అందుబాటులో ఉందని, అత్యవసర సమయాల్లో ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా.హదస్సా ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ నెల 10వ తేదీన అదనపు ఎస్పీ బి.సాంబయ్య (54) తీవ్రమైన గుండెపోటుతో తమ డిస్పెన్సరీకి రాగా వెంటనే ఆయనకు టెనెక్టెప్లేస్ ఇంజక్షన్ (రక్తం గడ్డను కరిగించే మందు) ఇచ్చి, స్టెబిలైజ్ చేసి ప్రాణాలు కాపాడామని ఆమె తెలిపారు. తదుపరి చికిత్స కోసం 108 వాహనంలో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్, వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శులు, హెల్త్ డైరెక్టర్లు రాష్ట్ర సచివాలయ ఉద్యోగులపై ప్రత్యేక శ్రద్ధతో సివిల్ డిస్పెన్సరీలో అందుబాటులో ఉంచిన ఈ సౌకర్యాన్ని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Centre, Governorpet, Vijayawada - 520 002 (A.P.)

E PROCUREMENT SHORT TENDER NOTICE

APCRDA invites tenders for the following works:

(1) NIT No.21/MAU61-USI0HB(OTH)/157/2024-CETT, Dated: 17.10.2024

Name of the Work: Providing Certain Modifications for Room No. 129-A, Ground Floor, Building No. 4 in A.P Secretariat, Velagapudi" - Estimate Amount: Rs.5,65,000/-

(2) NIT No.21/MAU61-USI0HB(BG)/9/2024-CETT-Part(1), Dated: 17.10.2024

Name of the Work: "Providing certain Repair and Renovation works to the Room No. 121 of A.P Legislature Building, A.P Secretariat, Velagapudi"- Estimate Cost: Rs.2,50,000/-

The bids can be downloaded on AP e-procurement portal from 18.10.2024 to 22.10.2024 up to 14.00 Hrs. Due date for submission of Bids 22.10.2024 up to 15.00 Hrs, Technical bid opening 22.10.2024 @ 16.00 Hrs. For further details please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in

Sd/- Commissioner, APCRDA, Vijayawada

సంపాదకీయం

విద్వేష ప్రచార పర్యవసానం

దసరా మర్నాడు ఉత్తరప్రదేశ్‌లోని బహ్రేయిచ్ ప్రాంతంలో రెండు మతాల మధ్య చెలరేగిన ఘర్షణల్లో 22 ఏళ్ల రాం గోపాల్ మిశ్రా మరణించాడు. ఆయన ఏ మతానికి చెందినవాడు అన్నది అంత ప్రధానమైన అంశం కాదు. ఆయన మరణానికి ఏ మతం వారు కారకులు అన్నది కూడా ముఖ్యం కాదు. అసలు సరదాగా, హుషారుగా, ఆనందంగా పండగలు చేసుకునే సందర్భాలలో మత కలహాలు ఎందుకు చెలరేగుతున్నాయి, వీటి వెనకాల ఉన్నవారు ఎవరు, వారు ఎంతటి విద్వేషాన్ని రెచ్చగొట్టినందువల్ల కలహాలు జరుగుతున్నాయన్నదే కీలకాంశం. ఈ దుర్ఘటన జరిగిన తరవాత అక్కడ నాలుగు రోజుల నుంచి ఇంటర్నెట్ సదుపాయాన్ని నిలిపివేశారు. కలహాలు మరింత విస్తరించకుండా నిరోధించడం ప్రభుత్వ ఉద్దేశం అయి ఉండొచ్చు. కానీ దీనివల్ల మనుషుల మధ్య సంభాషణలకూ అవాంతరం కలుగుతోంది. ఆర్థికనష్టం అపారంగా ఉంటోంది. యోగీ సర్కారు ఈ దుర్ఘటన తరవాత అనేకమందిని అరెస్టు చేయడంలో నిమగ్నమైపోయింది. ఈ కలహాలకు కొన్నేళ్లుగా తాము పెంచి పోషిస్తున్న విద్వేషమే ప్రధాన హేతువు అన్న వాస్తవాన్ని వాటంగా విస్మరిస్తోంది. మిశ్రా మరణం ఎలా జరిగింది, ఆయనను ఎన్ని రకాలుగా చిత్రహింసలు పెట్టారో ప్రభుత్వం ఒడిలో ఆశీనమైన మీడియా కట్టుకథలల్లి ప్రచారంలోపెడ్తూ ఈ ఘర్షణలకు మరింత ఆజ్యం పోస్తోంది. అది మరింత ప్రమాదకరం. రాం గోపాల్ మిశ్రాను అనేక చిత్రహింసలు పెట్టారని, అతడి కాలి గోళ్లు పెరికేశారని గోదీ మీడియా కథలల్లి ప్రచారంలో పెడ్తోంది. కానీ శవ పరీక్ష ఈ దుష్ప్రచారాన్ని తుత్తినియలు చేసింది. మిశ్రా కాలి గోళ్లు పెరికేసిన జాడలేవీ లేవు కాని ఆయన బొటన వేలు మధ్యభాగానికి గాయం అయిందని శవపరీక్ష నివేదిక చెప్తోంది. అతని కంటి దగ్గర గాయాలున్నట్టు కూడా తెలియజేసింది. దాదాపు మూడు రోజులుగా గోదీ మీడియా కొనసాగిస్తున్న దుష్ప్రచారం ఉద్రిక్తతలను రెచ్చగొట్టడానికి తప్ప ఎందుకూ ఉపకరించదు. మిశ్రాకు ఎలక్ట్రిక్ షాక్ ఇచ్చారని కూడా ప్రచారంలో పెడ్తున్నారు. కానీ యోగీ సర్కారు అధీనంలో పనిచేసే పోలీసులే ఖండిస్తున్నారు. ఈ మరణానికి కారకులైన వారిని నిర్బంధించి చట్ట ప్రకారం శిక్ష పడేట్టు చేస్తామని కూడా హామీ ఇస్తున్నారు. అయితే యోగీ ఆధిపత్యంలో ఇవన్నీ సక్రమంగా జరుగుతాయని నమ్మడం కష్టమే. ఈ సంఘటనలో మరే వ్యక్తికి చిన్న గాయమైనా కలగలేదు. మిశ్రా శరీరంలో అనేక చిన్నచిన్న తుపాకీ గుళ్ల జాడలు మాత్రం కనిపించాయి. దుర్గా విసర్జన ఊరేగింపు మార్గ మధ్యమంలో ముస్లింలు అధికంగా నివసించే ఒక ప్రాంతం దగ్గరకు వచ్చేసరికి ఊరేగింపులో పాల్గొంటున్న వారు ముస్లింలను, వారి అమ్మలక్కలను దూషించిన పాటలు వినిపించడం మొదలు పెట్టారు. ఇది ఏదో విధంగా మతకలహాలు, ముఖ్యంగా ముస్లింలను రెచ్చగొట్టడానికి చేసిన పనే అని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆ ఊరేగింపులో పాల్గొన్న రాం గోపాల్ మిశ్రా ఒక ముస్లింల ఇంట్లోకి దూసుకెళ్లి మేడ మీదకు వెళ్లి అక్కడున్న ముస్లింల చిహ్నంగా భావించే ఆకుపచ్చ జెండాను పెకలించివేసే క్రమంలో ఆ భవనం రైలింగును పడదోశాడు. అక్కడ కాషాయ జెండా ఎగురవేశాడు. దీని గురించి మాత్రం ఊరేగింపులో పాల్గొన్న మూకలు ప్రస్తావించవు. రాం గోపాల్ మిశ్రా మృతి తప్పని సరిగా ఖండించాల్సిందే. ఆయన మరణానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాల్సిందే. ఇందులో మరో మాటకు తావు లేదు.

ఇలాంటి సంఘటనే ఏ బెంగాల్‌లోనో, కేరళలోనో జరిగితే ఇప్పటికే ముఖ్యమంత్రి రాజీనామా చేయాలన్న నినాదాలు మిన్నంటేవి. ఇప్పుడు ఎవరూ యోగీ ఆదిత్యనాథ్ రాజీనామా చేయాలని అడగరెందుకో! గోదీ మీడియా కూడా యోగి రాజీనామా చేయాలని రగడ చేయదు. పండగలు, పబ్బాల సమయంలో మతపరమైన ఊరేగింపులు ఇప్పుడే జరగడంలేదు. అయితే విద్వేషం రెచ్చగొట్టేవారు కొత్త కొత్త శోభా యాత్రలు నిర్వహిస్తున్నారు. ఆ సందర్భాలలో కావాలని ముస్లింలు ఎక్కువగా ఉండే ప్రాంతాల నుంచి యాత్రలు నిర్వహిస్తున్నారు. రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తూ అత్యధిక సంఖ్యాకులైన వారికి మైనారిటీల నుంచి రక్షణ లేదు అన్న ప్రచారం విస్తృతంగా చేస్తున్నారు. గత పదేళ్ల పైనుంచి ఈ దుర్భర వాతావరణమే కొనసాగుతోంది. ఇలాంటి ఊరేగింపులకు అనుమతి మంజూరు చేసేటప్పుడు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా కట్టుదిట్టంచేసే బాధ్యతను యోగీ ప్రభుత్వం నిర్వహించేదని కళ్లకు కట్టినట్టు కనిపిస్తోంది. అనుమతిఇచ్చే ముందు రెండు పక్షాలను సంప్రదించి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడబోమని హామీ తీసుకున్న ఉదంతాలూ కనిపించడం లేదు. అంటే ఈ రెచ్చగొట్టే కార్యక్రమాలకు ప్రభుత్వ మద్దతు ఉందనుకోవలసి వస్తోంది. తాను అధికారంలోకి వచ్చినప్పటినుంచి సంఘ వ్యతిరేక శక్తులను ఏరిపారేశామని, ఇప్పుడు తమ రాష్ట్రం శాంతిభద్రతలకు ప్రతీకంగా మారిందని యోగీ పదే పదే బాకా ఊదుతుంటారు. కాని ఇలాంటి సంఘటనలు యు.పి.లో జరిగినన్ని మరే రాష్ట్రంలోనూ జరగడం లేదు. రెండు పక్షాలను పిలిపించిన దాఖలాలే లేవు. ఒక వ్యక్తి మరణానికి దారితీసిన సంఘటనకు తావే ఉండకూడదు. కానీ ప్రయత్నపూర్వకంగా విద్వేషం ప్రచారం చేస్తున్నారు. వీటిని బీజేపీ పాలిత రాష్ట్రాలలో ఎక్కడా కనిపించవు. ఇలాంటి పనులు అంతిమంగా హిందూ మతానికే అపకారం చేస్తాయి. హిందువులలో లేనిపోని భయాందోళనలు సృష్టిస్తాయి. అనేక మంది బీజేపీ నాయకుల పిల్లలు విదేశాల్లో చదువుతూ ఉంటారు. వారి పిల్లలు మతకలహాలకు దారితీసే ఊరేగింపుల్లో ఎప్పుడూ పాల్గొనరు. ఇక్కడ మతోద్రేకాలకు బలయ్యేది మాత్రం సామాన్య జనం, యువతరం. వారి మనసుల నిండా విద్వేషం నింపడంలో మతతత్వ బీజేపీ నిరంతరం కృషి చేస్తూనే ఉంది. బహ్రేయిచ్ సంఘటనలో మరణించింది ఏ మతం వాడు అన్న చర్చలు కేవలం కలహాలు మరింత పెరగడానికే ఉపకరిస్తాయి. మత విద్వేషాలు రగుల్కొంటూనే ఉన్నాయి. ఈ దుష్ప్రచారానికి లొంగి పోకుండా మనల్ని కాపాడుకోవడం మన బాధ్యతే. ఈ సందర్భంలో హిందూ మూకలకు ముస్లింల ఇళ్లల్లో దూరే అవకాశం ఎవరిస్తున్నారు. ఈ అక్రమ ప్రవేశాలను నిరోధించే బాధ్యత ప్రభుత్వాలదే కదా? యోగీ ఈ విషయంలో సంపూర్ణంగా విఫలమయ్యారు. హిందూ మతోన్మాదానికి ఆజ్యం పోయడంలో యోగీ ఆదిత్యనాథ్ మోదీ, అమిత్ షాను ఎప్పుడో మించిపోయారు. ఉత్తరప్రదేశ్‌లో తొమ్మిది శాసనసభా స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. సరిగ్గా ఎన్నికలు జరగడానికి కొద్దిగా ముందు మత కలహాలు రెచ్చగొట్టేవని ఓ పథకం ప్రకారం జరుగుతోంది. తాము అధికారంలో లేని చోట్ల అధికారం సంపాదించడానికి బీజేపీ అనేక రకాలుగా ప్రయత్నిస్తోంది. కానీ మతకలహాలు రెచ్చగొట్టే కుతంత్రం అత్యంత ప్రమాదకరం. బహ్రేయిచ్ సంఘటన కచ్చితంగా విద్వేష ప్రచార పర్యవసానమే.

ప్రజాస్వామ్యంలోనే ఉన్నామా!

ఓ అప్రజాస్వామ్య దేశమా! నన్నెందుకు ఇక్కడ పుట్టనిచ్చావ్. ఈ దేశంలో పుట్టినందుకు బాధపడని రోజులేదు. ప్రజలారా రోజూ బాధపడే కంటే తిరగబడలేరా. దినదినం చావు కంటే వీర మరణం మేలు కదా! ఏంటి బావా ప్రజల్ని తిరగబడమంటున్నావు. ఎవరి మీద ఎందుకు. ఎందుకంటావేమిటయ్యా ఏమీ తెలియనట్లు. మనది ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం అని గొప్పలు చెప్పుకుంటాం. అసలు నీకు మాట్లాడే స్వేచ్ఛ ఉందా. అంతెందుకు మన రాష్ట్రంలోనే రెడ్‌బుక్ అని ఒకరంటే గ్రీన్‌బుక్కని ఒకరు. ఈ రెండు బుక్కుల పేరుతో మన నొసటన అరాచకులని ముద్రవేసి మనల్ని చంపేస్తారు. క్షమించమంటే ఇంటికి పరిమితమవమంటారు. ఇదంతా చూస్తూ ఏంటి బావ అంటే ఏం చెప్పను. నిజమేనయ్యా మన దేశంలో నెహ్రూ ప్రధానిగా ఉన్న రోజుల్లో కొంత వరకు ప్రజాస్వామ్య విలువలు పాటించారు. ఆ రోజుల్లో ఆచార్య కృపలాని, రామ్ మనోహర్ లోహియా, పుచ్చలపల్లి సుందరయ్య, భూపేష్ గుప్తా , అశోక్ మెహతాలాంటి ఉద్దండులు పార్లమెంటులో యిచ్చిన సలహాలు ప్రధాని నెహ్రూ పెడచెవిని పెట్టకుండా వాటిని స్వీకరించి అవసరమైనవి ఆచరించేవారు.

బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ఆర్థికమంత్రి ఎంత శ్రమపడేవారో అంతకంటే శ్రమపడి బడ్జెట్‌లో సవరణలు ప్రతిపక్షం ప్రవేశపెట్టిన సందర్భం ఉంది. కాని ఇప్పుడు నాయకులారా మనది ప్రజాస్వామ్యం అనకండి. ప్రజలు

నవ్వితే...మేధావులు ముక్కున వేలేసుకుంటారు. పార్లమెంటులో శాసనసభల్లో ప్రతిపక్షానికి మైకు ఇవ్వని ప్రజాస్వామ్యం యిప్పుడుంది. మైకు యివ్వకపోయినా పబ్లిక్‌లో మనది ప్రజాస్వామ్య దేశమంటాడు. ఎందుకంటే తరువాత సదరు నాయకుడు అధికారంలోకి వస్తే అదే తరహా ప్రజాస్వామ్యం ఉంటుంది కనుక. నెహ్రూ తరువాత జైకిసాన్ అన్న లాల్‌బహదూర్ శాస్త్రి మరణం తరువాత పగ్గాలు చేపట్టిన ఇందిరాగాంధీ అప్రజాస్వామిక పద్ధతులకు నాంది పలికారు. రానురాను నియంత పాలనకు తెరతీసింది. ఆమెది తన మనస్తత్వం కాదని అహంభావమని స్వయంగా ఆమె తండ్రి నెహ్రూ జైలులో ఉండి సోదరి విజయలక్ష్మిపండిట్‌కు రాసిన లేఖలో పేర్కొన్నట్లు ఆనాటి పెద్దలు చెప్పగా విన్నాను. ఏదిఏమైనా ఇందిరతో మొదలైన నియంతృత్వ పోకడలు నియంతలా రాజుల పాలనలా సాగుతోంది. ఆమె నేర్పిన పోకడలు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు అంది పుచ్చుకున్నారు. ప్రస్తుతం మన దేశంలో అప్రజాస్వామ్య పోకడలు కొనసాగుతున్నాయని మతం పేరుతో ప్రజల్ని బానిసలుగా తయారుచేసి పాలనచేసే పద్ధతికి బీజేపీ శ్రీకారం చుట్టి పాలన సాగిస్తోంది. ప్రతిపక్షాలు కూడా బాధ్యత మరచి వ్యవహరిస్తున్నాయి.

ప్రతిపక్షాలు ప్రభుత్వ అప్రజాస్వామ్య పద్ధతులు ఎండకట్టి తగు సూచనలిచ్చి గాడిలో పెట్టే పరిస్థితి కంటే ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలుచేసి గద్దెనెక్కే ఆలోచనలు చేస్తున్నాయి. తమ పార్టీ నేతకో, పార్టీతో ఇబ్బంది కలిగితే తప్ప ప్రతిపక్షం ప్రజాసమస్యలపై ప్రజల్లోకి రావడంలేదు. ప్రజల ఇబ్బందులపై ప్రజల్లో తిరగడం మాని ప్రెస్‌మీట్లకు పరిమితమవుతున్నారు. పేపరు స్టేట్‌మెంట్లు అబద్దాలతో ప్రభుత్వం నడుపుతుంటే అదే రీతిలో ప్రతిపక్షం ఉంటే ఇక ప్రజల బాధలు పట్టించుకునేదెవరో తెలియదు. మన పక్క రాష్ట్రం తమిళనాడులో రాష్ట్రానికి రావల్సిన నిధుల విషయంలో అధికారపక్షంతో ప్రతిపక్షం చేతులు కలిపి కేంద్రంపై పోరాటం చేస్తుంటే మన రాష్ట్రంలో నిధులురాక ప్రజల సమస్యలు తీర్చకపోతే మంచిదని ప్రతిపక్షం భావిస్తున్న సంఘటనలున్నాయి. ప్రభుత్వం ప్రజల కోసం చేపట్టిన పథకాలు అమలు జరక్కుండా ప్రతిపక్షం కోర్టుకెళ్లిన సంగతులున్నాయి. ఇదిలా ఉంటే కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ పోకడలకు హద్దు లేకుండా పోతోంది. చివరకు స్వతంత్ర ప్రతిపత్తి లేకుండా చేసి సీబీఐని కూడా గుప్పెట్లో పెట్టుకుంటుందని మేధావులు అభిప్రాయపడుతున్నారు. ఏదో ఒక విషయంలో ఏ ప్రభుత్వంలోనైనా చిన్న తప్పు జరగవచ్చు. దాన్ని పట్టుకుని కేసుల్లో యిరికించి సీబీఐని వాడుకోవడం హేయమైన చర్యగా భావించాలి. అడ్డదారుల్లో గద్దెనెక్కి ప్రతిపక్షం గొంతునొక్కి పాలనచేస్తూ మనది అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని చెప్పుకుంటున్న నాయకుల్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు.

రైతు వ్యతిరేక చట్టాలుచేస్తూ ప్రజల ఆస్తులు ప్రైవేటుపరం చేయడానికి వెనుకాడని కేంద్రప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని బీజేపీ గ్రహిస్తే మంచిది. దేశాన్ని అప్పులపాలుచేసి ప్రజల ఆస్తులు అమ్మడానికి సిద్ధపడుతున్న పరిస్థితి నాయకుల అసమర్థ పాలనగా ప్రజలు భావిస్తున్నారు. ఇదిలా ఉంటే దేశానికి ఒకేసారి ఎన్నికలు జరగాలని పార్లమెంటులో బిల్లు పెట్టింది. ఒకే దేశం ఒకే ఎన్నిక నినాదంతో ముందుముందు హిందువులే భారత్‌లో ఉండాలనే బిల్లు పెట్టడానికి బీజేపీ వెనుకాడదు. ఐదేళ్లు పాలించమని ఎన్నుకున్న రాష్ట్రాలలో మధ్యంతర ఎన్నికలు జరపడం పౌరహక్కులు కాలరాయడమే కదా. ఏది ఏమైనా ఆర్ఎస్ఎస్ పట్టుదలకు లొంగి కేంద్రంలో ఉన్న బీజేపీ జమిలి ఎన్నికలకు సమాయత్తం కావడం అధ్యక్ష తరహాలో నియంత పాలనకు దారి తీయడమేనని ప్రజాస్వామ్యవాదులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. మనిషికి ప్రాథమికంగా కావల్సింది స్వేచ్ఛ. అది లేనప్పుడు మానవుడు జంతువుతో సమానమే. ఆలోచించి ప్రశ్నించే హక్కు ప్రతి ఓటరుకు ప్రాథమిక హక్కుగా భావించాలి. ప్రశ్నతోనే అభివృద్ధి సాధ్యమనే మాట నాయకులు ప్రెస్‌మీట్లకు పరిమితం చేస్తున్నారు. ఆలోచనలతో మనిషి ముందుకు సాగగలడు. ప్రశ్నించకపోతే నియంతృత్వ పోకడలకు హద్దు ఉండదు. మానవుని ప్రాథమిక హక్కును హరించే హక్కు ఎవరికి ఉండదు.

సెల్: 9885569394

వయనాడ్‌కి సాయమేది?

పి.శ్రీకుమార్

ప్రతిపక్షాల పట్ల వివక్షచూపే అలవాటు ప్రధాని నరేంద్ర మోదీకి తొలినుంచి ఉంది. భారీ వర్షాలకు, వరదలకు, మట్టిపెళ్లలు విరిగిపడి ఎన్నో బాధలు అనుభవించినా రూపాయి ఇవ్వని ప్రత్యేకత మోదీది. కేరళ వయనాడ్ ప్రాంతంలో నాలుగు నెలలక్రితం సంభవించిన ప్రకృతి విపత్తుకు లక్షల మంది ప్రజలు చెప్పలేనన్ని బాధలు అనుభవించారు. విపత్తులు జరిగిన తర్వాత ఆలస్యంగా ఆ ప్రాంతాన్ని సందర్శించిన మోదీ ఎంతమాత్రం సహాయాన్ని ప్రకటించలేదు. వయనాడ్ ప్రాంతంలో జరిగిన విషాదం అంతాఇంత కాదు. సహాయం కోసం కేరళ హైకోర్టు కేంద్రానికి రెండుసార్లు ఆదేశాలిచ్చింది. అలాగే కేరళ అసెంబ్లీ సహాయం కోసం ఏకగ్రీవంగా తీర్మానించి కేంద్రానికి విన్నవించింది. మట్టిపెళ్లలు విరిగిపడి బురదతో కూడిన వరదనీరు గ్రామాలను ముంచెత్తింది. 400 మందికిపైగా మరణించారు. ఆస్తుల నష్టం అంచనా వేయలేనిది. కేరళ హైకోర్టు 2024, అక్టోబరు 4వ తేదీన మొదటిసారి ఇచ్చిన ఉత్తర్వులో తక్షణం స్పందించాలని కోరినా జాతీయ విధ్వంస సహాయ నిధి సంస్థ (ఎన్‌డిఆర్ఎఫ్) స్పందించలేదు. వయనాడ్‌లో జరిగిన ప్రకృతి విపత్తు బాధితులకు సహాయం కోరినా ప్రధాని జాతీయ సహాయనిధి సంస్థ

కేరళ బాధితులకు కనీసం తాత్కాలిక సహాయాన్నిసైతం ప్రకటించకుండా, నష్టం వివరాల నివేదికను ఇవ్వాలని మాత్రం మోదీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అతి పెద్ద విపత్తు సంభవించినా రాష్ట్రంలో బాధితులను విస్మరించడం అత్యంత దారుణం. ఆంధ్రప్రదేశ్, త్రిపురల్లో సంభవించిన ప్రకృతి విపత్తుకంటే కేరళలో జరిగిన విషాదం చాలా ఎక్కువని అంచనావేశారు. వయనాడ్‌లో 400 మందికి పైగా తమ ప్రాణాలు కోల్పోయారు. అయినప్పటికీ కేంద్రం ఇంతవరకు స్పందించలేదు

(పీఎంఎన్ఆర్ఎఫ్) బాధితులకు రూపాయిని విదల్చలేదు. 2024 జులై 30వ తేదీన వయనాడ్‌లో గొప్ప విషాదం జరిగింది. అయినా కేంద్రం ఇంతవరకు కనికరించలేదు. సహాయం చేయవలసిన బాధ్యతను మరిచింది.

తక్షణం ఎన్‌డిఆర్ఎఫ్, పీఎంఎన్ఆర్ఎఫ్ నుంచి వయనాడ్ బాధితులకు సహాయంగా నిధులను ఇప్పించాలని కేరళ హైకోర్టు అక్టోబరు 10వ తేదీన రెండవసారి ఉత్తర్వు చేసింది. ప్రధాని మోదీ, కేంద్ర అధికారుల బృందం వయనాడ్ ప్రాంతాన్ని సందర్శించిందని అమికస్ క్యూరీ రంజిత్ థంపన్ నివేదికను సమర్పించింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా నష్ట నివేదికను అందచేసి సహాయం కోరింది. విపత్తు జరిగి దాదాపు 80రోజులు గడిచినా కేంద్ర ప్రభుత్వం ఇంతవరకు స్పందించలేదు. ప్రకృతి విపత్తులకు సంబంధించి కేరళ హైకోర్టు స్పందించి తనంతటతాను జులై 30న విచారణ జరిపింది.

జారీ చేసింది. బ్యాంకు రుణాల రద్దుకు, సహాయం వకటించాలని సానుకూల స్పందనకు తనకుగల పలుకుబడిని ఉపయోగించాలని అదనపు సొలిసిటర్ జనరల్ ఎఆర్ఎల్ సుందరేశన్‌ను కోర్టు కోరింది. వయనాడ్ ప్రాంతం తిరిగి పూర్తిగా కోలుకునేందుకు సహాయం అవసరమని కోర్టు భావించింది. పునరావాసం, ఇళ్ల పునర్నిర్మాణం చర్యలపైన వార్తలను ప్రచురించడం, మీడియా ప్రసారం చేయడంపైన ఆంక్షలు విధించడానికి కోర్టు తిరస్కరించింది. వార్తల సేకరణలో తగిన సంయమనం పాటించి వాస్తవాలు మాత్రమే రాయాలని కోర్టు సూచించింది. తప్పనిసరిగా అందించాల్సిన నిధులను విడుదల చేయాలని రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానించింది. బాధితులు బ్యాంకులకు చెల్లించాల్సిన బకాయిలను రద్దుచేయాలని కూడా కేరళ ప్రభుత్వం కోరింది. బకాయిల రద్దును జాతీయ విపత్తుల నిర్వహణ అధారిటీని (ఎన్‌డీఎంఏ) ఒప్పించాలని కేంద్రాన్ని కేరళ ప్రభుత్వం కోరింది. అయితే కేంద్రం నుంచి పేలవమైన స్పందన వచ్చింది. ఎలాంటి వివక్ష ఉండబోదని మాత్రమే ఆర్థికమంత్రి నిర్మల

సీతారామన్ నుంచి వచ్చింది. అయినప్పటికీ ఇంతవరకు నిధులు విడుదల చేయలేదు. వయనాడ్ ప్రజలకు ఎటువంటి నిధులను తిరస్కరించే స్వేచ్ఛ ఆర్థిక మంత్రికి ఉన్నట్లుగా భావించాలి.

ఆంధ్రప్రదేశ్‌లో సంభవించిన వరద విపత్తు బాధితులకు సహాయంగా కేంద్ర ప్రభుత్వం వేగంగా అందించింది. కేరళ పట్ల వివక్ష చూపింది. తమ ప్రభుత్వం ఏర్పాటుకు టీడీపీ ప్రభుత్వం సహకరించడం వల్లనే వరద బాధితులకు సహాయాన్ని ప్రకటించింది. త్రిపురలో బీజేపీ ప్రభుత్వం ఉండటంవల్లనే కేంద్రం స్పందించింది. ఆంధ్రప్రదేశ్‌లో వరదలకు 34మంది చనిపోయారు. వరద ప్రాంతాలను సందర్శించిన కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ రాష్ట్ర ప్రభుత్వం నష్టం నివేదికను పంపకముందే విమానాశ్రయంలో రు.348 కోట్లు ప్రకటించినట్లు పత్రికలు వార్తను ప్రచురించాయి. ప్రతిపక్ష రాష్ట్ర ప్రభుత్వాలపట్ల మోదీ ప్రభుత్వ వివక్షను ఈ విషయాలు తేటతెల్లం చేస్తున్నాయి.

కేరళ బాధితులకు కనీసం తాత్కాలిక సహాయాన్నిసైతం ప్రకటించకుండా, నష్టం వివరాల నివేదికను ఇవ్వాలని మాత్రం మోదీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అతి పెద్ద విపత్తు సంభవించినా రాష్ట్రంలో బాధితులను విస్మరించడం అత్యంత దారుణం. ఆంధ్రప్రదేశ్, త్రిపురల్లో సంభవించిన ప్రకృతి విపత్తుకంటే కేరళలో జరిగిన విషాదం చాలా ఎక్కువని అంచనావేశారు. వయనాడ్‌లో 400 మందికి పైగా తమ ప్రాణాలు కోల్పోయారు. అయినప్పటికీ కేంద్రం ఇంతవరకు స్పందించలేదు. త్రిపురకు సైతం వెంటనే రూ.40కోట్లు కేంద్రం ప్రకటించింది. ఈ విషయాలు వివక్షను స్పష్టంగా తెలియజేస్తున్నాయి. కేంద్ర మంత్రులు అమిత్ షా, భూపేంద్ర యాదవ్ ప్రకటనలు పుండుమీద కారం చల్లినట్లు కేరళ ప్రజలను అవమానించారు. కేరళ హైకోర్టు కేంద్రం అక్టోబరు 18వ తేదీ లోపు స్పందించాలని ఆదేశించిన ప్రకారమైనా సహాయాన్ని ప్రకటిస్తుందా ?

పోలవరంపై కేంద్రం కిరికిరి

వి. శంకరయ్య

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం సాఫీగా నడవాలంటే ఆంధ్రప్రదేశ్‌లో కూటమి తరపున ఎన్నికైన పార్లమెంటు సభ్యుల అండదండలు తప్పని సరి. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు, బీహార్‌లో నితీశ్ కుమార్ కత్తి ఆ మొన ఈ మొనలు షేక్‌చేస్తే నరేంద్ర మోదీ ప్రభుత్వం "గోవిందా...." అని జాతీయ మీడియాతోసహా రాజకీయ విశ్లేషకులందరూ ఘోషిస్తున్న నేపథ్యంలో కూడా కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం చేసేందుకు తలపడుతోంది. రాష్ట్ర విభజన చట్టం మేరకు పోలవరంను జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించారు. ఎవరో ఒకరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడి కేంద్ర మంత్రివర్గం ఆమోదించిన ప్రాజెక్టు కానేకాదు. ఆంధ్రప్రదేశ్‌కు చట్టబద్ధంగా లభించినదే. అలాంటి ప్రాజెక్టుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పదేళ్లు గడిచినా ఇంత వరకు నేరుగా కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. పైగా సమగ్ర రెండవ డీపీఆర్ ఆమోదించలేదు. ముక్క చెక్కలు చేసి తొలి దశ అని ఒక డీపీఆర్ ఆమోదించింది. ఈ ఘోరాన్యాయానికి బీజం వేసింది వైసీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి పూర్తి చేసింది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం. దాని దుష్ఫలితం రాష్ట్ర ప్రజలు అనుభవిస్తున్నారు. రెండేళ్ల క్రితం కర్నాటకలో బీజేపీ ప్రభుత్వం వున్న సమయంలో ఎగువ భద్రను జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించే సమయంలో ప్రాజెక్టు సమగ్ర డీపీఆర్ ఆమోదించడమే కాకుండా కేంద్ర బడ్జెట్‌లో ఏకంగా రూ.5300 కోట్లు కేటాయించారు. అదే సమయంలో పోలవరం ప్రాజెక్టుకు బడ్జెట్‌లో ఎటువంటి కేటాయింపులు చేయలేదు. దేశంలో ఎన్నో జాతీయ ప్రాజెక్టులు అమలులో వున్నాయి. వాటికిలేని దుస్థితి పోలవరం ప్రాజెక్టుకు మాత్రమే ఎందుకు దాపురించింది? ఇంతకన్నా ఘోరాతి ఘోరం మరొకటి వుంటుందా? బడ్జెట్‌లో నేరుగా నిధులు లేనందున పైసా విడుదల కావాలంటే కేంద్ర మంత్రివర్గం ఆమోదం తప్పని సరౌతోంది.

కాగా తాజాగా ఒడి గట్టిన అన్యాయం మరింత ఎక్కువనే చెప్పాలి. కేంద్ర మంత్రివర్గం ఆమోదించిన మేరకు కూడా నిధులు విడుదల కావడంలేదు. మధ్యలో కోత పెట్టారు. విచారకరమేమంటే ఈ నిధులు నిర్ణీత సమయంలో వ్యయం చేయగలరా? అని ప్రాజెక్టు అథారిటీ ప్రశ్నించినదంటే

ప్రాజెక్టు వద్ద యంత్రాంగం ఏ స్థితిలో వుందో అర్థం కాగలదు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన వెంటనే పోలవరం సందర్శించి తన రెండు ప్రాధాన్యతల్లో పోలవరం ఒకటిగా ప్రకటించారు. తమాషా ఏమంటే ఇంతటి కీలకమైన ప్రాజెక్టులో సిబ్బంది కొరత అని వార్తలు వచ్చాయి. ఇలాంటి లొసుగులు దృష్టిలో పెట్టుకొనే కాబోలు ప్రాజెక్టు అథారిటీ నిధులు నిర్ణీత వ్యవధిలో వ్యయం చేయగలరా అని ప్రశ్నించి వుండవచ్చు. తొలి నుంచి కూడా పోలవరం ప్రాజెక్టుపై కేంద్ర ప్రభుత్వం శీతకన్ను కొనసాగుతోంది. 2017లో కేంద్ర మంత్రివర్గం ఆమోదించినదనీ, 2013-14 షెడ్యూల్ రేట్లు ఇస్తామని కొన్నాళ్లు పేచీ పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుగా వ్యయంచేస్తే తిరిగి ఆ మొత్తం చేస్తామని మరి కొన్నాళ్లు చెబుతూ వచ్చారు. అంతిమంగా ఇప్పుడు తొలి దశ అని కొత్త పాట ఎత్తుకున్నారు. దీనికి తోడు జగన్‌మోహన్ రెడ్డి పార్లమెంటులో తన పార్టీ బలాన్ని పోలవరం లాంటి ప్రాజెక్టులకు నిధులు సాధించడానికి ఉపయోగించనందున కేంద్రంలోని బీజేపీ పని సులభమైంది. ప్రతిపక్షాలు మౌన వ్రతం పట్టాయి. నిలదీసి అడిగేవారు లేకపోయారు. దాని దుష్ఫలితమే తొలిదశ అనే విధానం తెరమీదకు వచ్చింది. ఈ దుర్విధానం ప్రస్తుతం కూటమి మెడకు తగులు కొన్నది.

2024 ఎన్నికల ముందు పోలవరం గురించి ఏదో ఒక డ్రామా ఆడకపోతే ఎన్నికల నుంచి బయట పడలేమని కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని వైసీపీ 2023లోనే పన్నిన పన్నాగ ఫలితమే పోలవరం తొలి దశ. ఈ నాటకంలో భాగంగానే వైసీపీ ప్రభుత్వం రూ.36,449.83 కోట్ల రూపాయలు ఇస్తే తొలిదశ పూర్తి చేస్తామని ప్రతిపాదనలు పంపింది. ఈ ప్రతిపాదనలను ప్రాజెక్టు అథారిటీ కేంద్ర జలసంఘంతో పాటు కేంద్ర జలశక్తి శాఖకు చెందిన అంచనాల సవరింపు కమిటీలు సమీక్షించి రూ.31,625.38 కోట్లకు కుదించాయి. ఒక్క హెడ్‌వర్క్స్ కిందనే 3031.20 కోట్లు కోత పెట్టారు. తర్వాత ఏమైందో ఏమోగాని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరి కొంత కోతపెట్టి తొలి దశ రూ.30 926 కోట్లుగా డీపీఆర్ ఆమోదించారు. పోలవరం ప్రాజెక్టు 45.72 మీటర్లు ఎత్తు పూర్తిస్థాయిలో నిర్మాణం జరగాలంటే కేవలం భూసేకరణ ఆర్ అండ్ ఆర్ పద్దు కింద దాదాపు రూ.30 వేలు అవసరమౌతుంది. ప్రాజెక్టు పూర్తయ్యేనాటికి ఇంకెంతమేర పెరుగుతుందో అంచనాలు లేవు. అయితే దీపముండగానే ఇల్లు చక్కపెట్టుకోవాలనే దృష్టి కూటమి ప్రభుత్వానికి వున్నట్లు కనిపించడంలేదు. సమగ్ర డీపీఆర్ గురించి అంతగా ఆలోచన చేస్తున్నట్లు కనిపించడంలేదు. కేంద్ర ప్రభుత్వం తొలి దశ డీపీఆర్ అని నిధులు విడుదల చేస్తుంటే అడ్వాన్స్ నిధులుగా పరిగణించుతామనే ధోరణిలో మనవాళ్లు ప్రకటనలు చేశారు. ఇప్పటి నుంచే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం వెంట పడవలసివుంది. 2027 నాటికి 41.15 మీటర్ల ఎత్తుకు ప్రధాన డ్యాం నిర్మిస్తే 115 టీఎంసీలు నీరు నిల్వ వుంటుంది. 41.15 మీటర్ల స్థాయి ఎండీడీఎల్ స్థాయి అయినా అవసరమైతే రిజర్వాయర్‌లో దాదాపు 60 టీఎంసీలు నీళ్ల వరకు వుంచి మిగిలిన నీరు తీసుకోవచ్చు. 41.15 మీటర్ల స్థాయి వరకు 115 టీఎంసీల నీళ్లు వుంచవచ్చు. ఈ నీళ్లు ఏం చేయాలనేది కూడా మిలియన్ డాలర్ల ప్రశ్నయే. గతంలో చంద్రబాబు నాయుడు హయాంలో కాఫర్ డ్యాం తోనే నీళ్లు నిల్వ చేయదలచినపుడు కూడా కేంద్ర జలశక్తి శాఖ నుంచి వచ్చే నిపుణులు ఈ ప్రశ్న లేవనెత్తి వున్నారు.

వాస్తవంలో కూటమి ప్రభుత్వం మరి కొంత పెంచి కేంద్రం నుంచి నిధులు సాధించాల్సి ఉంది. వచ్చిందే చాలన్నట్లున్న రాష్ట్ర ప్రభుత్వానికి పోలవరం ప్రాజెక్టు అథారిటీ ముందుగా తేలికపాటి షాక్ ట్రీట్‌మెంట్ ఇచ్చింది. కోతలు పెడుతూ ఇచ్చే నిధులైనా నిర్ణీత సమయంలో వ్యయం చేయగలరా అంటూ లేఖ రాసింది. అంతటితో ఆగకుండా కేంద్రమంత్రి వర్గం ఆమోదించిన నిధుల్లో కూడా తిరిగి రూ.1,669.56 కోట్లు కోత పెట్టారు. అందులో కీలకమైన హెడ్‌వర్క్స్ భూసేకరణ ఆర్ అండ్ ఆర్ విభాగాల్లోనే ఈ కోతలు పెట్టారు. వాస్తవంలో హెడ్‌వర్క్స్‌కు భూసేకరణ ఆర్ అండ్ ఆర్‌కు విడదీయలేని సంబంధముంది. ఏ కాంటూరు వరకైతే భూసేకరణ జరిగి నిర్వాసితులను తరలిస్తారో ఆ మేరకే ప్రాజెక్టు హెడ్ వర్క్స్ పనులు సాగించాలి. కేంద్ర మంత్రి వర్గం ఆమోదించిన మేరకైనా నిధులు ఇవ్వక పోవడం పైగా కోత విధిస్తున్నారంటే వాస్తవంలో ఇచ్చే నిధులు వ్యయం చేసే సామర్థ్యం ప్రాజెక్టు సైట్‌లో యంత్రాంగానికి లేదని ప్రాజెక్టు అథారిటీ పసిగట్టి అడ్డు చెబుతోందా? గత అయిదేళ్లుగా నిస్తేజంగా వున్న యంత్రాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇంకా గాడిన పెట్టలేదా? ఇవన్నీ పక్కన పెడితే రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. దాని ప్రాధాన్యతల్లో పోలవరం ప్రాజెక్టు వుందని తెలిసి కేంద్రమంత్రి వర్గం ఆమోదించిన నిధుల్లో కూడా కోతపెట్టడం ఒకింత పక్షపాత ధోరణి తప్ప వేరుకాదు. అయితే ఖంగుతిన్న రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర మంత్రివర్గం ఆమోదించిందనే ధీమాలో వున్నట్లు చెబుతున్నారు. సాక్షాత్తు పార్లమెంటు ఆమోదించిన రాష్ట్ర విభజన చట్టానికే దిక్కులేదు. దీనికి మాత్రం ఏం విలువ వుంటుంది?

విశ్రాంత పాత్రికేయులు
సెల్: 9848394013

బీహార్‌లో కల్తీ మద్యం కలకలం

- రెండు జిల్లాల్లో 32కు మృతుల సంఖ్య
- డబుల్ ఇంజిన్ ప్రభుత్వమే బాధ్యత వహించాలి: కాంగ్రెస్

సివాన్/సరన్: బీహార్‌లో కల్తీ మద్యం తాగి దుర్మరణం పాలైన వారి సంఖ్య 32కు చేరింది. మంగళవారం రాత్రి రాష్ట్రంలోని సివాన్, సరణ్ జిల్లాలకు చెందిన కొంతమంది కల్తీ మద్యం తాగి అనారోగ్యం పాలయ్యారు. బుధవారం నాటికి మృతుల సంఖ్య ఎనిమిది ఉ ఉండగా... గురువారం ఆ సంఖ్య 32కు చేరింది. ఇంకా కొంతమంది బాధితులలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. అత్యధికంగా సివాన్ జిల్లాలో ఏకంగా 20 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ మేరకు సివాన్ ఎస్పీ అమితేష్ కుమార్ తెలిపారు. దాదాపు 15 మంది అస్వస్థతకు గురి కాగా వారిని పాట్నాలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. మరోవైపు సరన్ జిల్లాలో కల్తీ మద్యం సేవించి నలుగురు ప్రాణాలు కోల్పోయినట్లు చాప్రా ఎస్పీ ఆషిశ్ కుమార్ తెలిపారు. ఘటనపై దర్యాప్తు చేపట్టేందుకు సిట్‌ను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈమేరకు ఎనిమిది మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి.. అందులో ముగ్గుర్ని ఇప్పటికే అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు వెల్లడించారు. మస్రాక్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ నుంచి వివరణ కోరినట్లు వెల్లడించారు. భగవాన్‌పూర్ ఎస్‌హెచ్‌ఓతోపాటు ఏఎస్ఐపై చట్టపరమైన చర్యలు తీసుకున్నామన్నారు.

నిషేధం అమల్లో ఉంటే కల్తీ మద్యం ఎక్కడిది? ఆర్జేడీ

రాష్ట్రంలో నిషేధం ఉండగా కల్తీ మద్యం ఎలా అందుబాటులోకి వచ్చిందని ప్రతిపక్ష ఆర్‌జేడీ ప్రశ్నించింది. నితీశ్‌కుమార్ ప్రభుత్వంపై విరుచుకుపడింది. బీహార్‌లో మద్యపాన నిషేధ చట్టం అమల్లో ఉన్నప్పటికీ, కల్తీ మద్యం దొరకడం ఆందోళన కలిగించే విషయమని ఆర్జేడీ నేత మృత్యుంజయ్ తివారీ అన్నారు. అనేక మంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని తెలిపారు. లిక్కర్ మాఫియాకు రాష్ట్ర ప్రభుత్వ అండదండలు ఉన్నాయని...అందుకే మద్యపాన నిషేధ చట్టం ఉల్లంఘన జరుగుతోందని మండిపడ్డారు.

డబుల్ ఇంజిన్ ప్రభుత్వానిదే బాధ్యత: ఖర్గే

సివాన్, సరన్ జిల్లాల్లో కల్తీ మద్యం తాగి అనేకమంది మృత్యువాత పడటానికి అవకాశవాద డబుల్ ఇంజిన్ ప్రభుత్వమే కారణమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే విమర్శించారు. కాంగ్రెస్‌ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా కూడా కల్తీ మద్యం మరణాలకు ఎన్డీఏ ప్రభుత్వానిదే బాధ్యత అన్నారు. రాష్ట్రంలో మద్య నిషేధం అమలులో ఉన్నప్పటికీ నకిలీ మద్యం అక్రమ వ్యాపారం విచ్చలవిడిగా సాగుతోందన్నారు. బీహార్‌లోని సివాన్, సరన్‌లోని 16 గ్రామాలలో ఇప్పటివరకు 36 మంది నకిలీ మద్యం కారణంగా మరణించారని... ఇది అత్యంత బాధాకరమని ఖర్గే 'ఎక్స్' వేదికగా వ్యాఖ్యానించారు. 'బాధితులైన వారి కుటుంబాలకు మా ప్రగాఢ సానుభూతి. దోషులకు వీలైనంత కఠినంగా శిక్షించేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం' అని ఆయన పేర్కొన్నారు. అక్రమ మద్యం వ్యాపారాన్ని నివారించడంలో నితీశ్ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు.

'ఎవరి ప్రమేయం ఉన్నా వదిలేదిలేదు: బీజేపీ

ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలపై బీజేపీ స్పందించింది. బీహార్‌లో సంపూర్ణ మద్య నిషేధం అమల్లో ఉందని బీజేపీ నేత షానవాజ్ హుస్సేన్ తెలిపారు. కొందరు లిక్కర్ మాఫియా ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఇందులో ఎవరి ప్రమేయం ఉన్నా వదిలిపెట్టేది లేదని పేర్కొన్నారు. సీఎం నితీశ్ కుమార్ చాలా కఠినంగా వ్యవహరించనున్నారని వెల్లడించారు. సివాన్-ఛాప్రాలో చాలా మంది కల్తీ మద్యం వల్ల ప్రాణాలు కోల్పోవడం బాధకరమని అన్నారు. సీఎం నితీశ్ కుమార్ ప్రభుత్వం 2016లో మద్యం అమ్మకాలు, వినియోగంపై నిషేధం విధించిన విషయం తెలిసిందే. అయినా బ్లాక్ మార్కెట్‌లో అక్రమంగా మద్యం దందా కొనసాగుతూనే ఉన్నది. కల్తీ మద్యం తాగి ప్రజలు మరణిస్తున్న ఘటనలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. ఏటా పదుల సంఖ్యలో ప్రజలు ఈ మద్యం కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారు.

కఠిన శిక్షలు తప్పవు

బాంబు బెదిరింపులపై కేంద్రం ఆగ్రహం

న్యూఢిల్లీ: భారత విమానయాన సంస్థలకు చెందిన విమానాలకు నాలుగు రోజులుగా వరుస బాంబు బెదిరింపులు రావడంతో పలు విమాన సర్వీసులు రూట్ మార్చడంతోపాటు అత్యవసరంగా ల్యాండింగ్ అవుతున్నాయి. ఇలాంటి పనులు చేసే ఆకతాయిల ఆటకట్టించేందుకు కఠిన చర్యలు తీసుకొనే దిశగా పౌర విమానయానశాఖ సన్నద్ధమవుతున్నట్లు సీనియర్ అధికారి తెలిపారు. గత నాలుగు రోజుల్లో 20పైగా విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. వీటిలో జాతీయ, అంతర్జాతీయ విమానాలు కూడా ఉన్నాయి. వీటిపై చేపట్టిన విచారణలో నకిలీవని తేలాయి. దీంతో ఇలాంటి పనులు చేసే ఆకతాయిలను అడ్డుకొనేందుకు పౌర విమానయానశాఖ సన్నద్ధమైంది. వారిని నో-ఫ్లై లిస్ట్‌లో చేర్చాలని భావిస్తోంది. దీనితోపాటు అలాంటి వారికి కఠిన శిక్షలు వేసేలా 'బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ'లో మార్పులు తీసుకురావాలని యోచిస్తోంది. ఈ నిబంధనల్లో మార్పులు చేసేందుకు అభిప్రాయాలు సేకరిస్తోంది. విమానంలో వికృత చేష్టలకు పాల్పడిన వారికి వ్యతిరేకంగా కొన్ని నిబంధనలు ఉన్నాయి. అయితే సోషల్‌మీడియా నుంచి వచ్చే బాంబు బెదిరింపులు లాంటి సందర్భాలు ఎదురైతే శిక్షించేందుకు ఎలాంటి నిబంధనలు లేవు. తరచూ ఈ తరహా ఘటనలు ఎదురవుతున్న నేపథ్యంలో వీటి కోసం ప్రత్యేక నిబంధనలు తీసుకొచ్చేందుకు కేంద్రం ప్రయత్నిస్తోంది.

ఒకే రోజు ఐఏఎఫ్, ఆర్మీ దంపతుల ఆత్మహత్య

న్యూఢిల్లీ: భారత సాయుధ దళాల్లో పనిచేస్తున్న దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్, ఆర్మీలో విధులు నిర్వహిస్తున్న వారిద్దరూ వేర్వేరు నగరాల్లో ఒకేరోజు ప్రాణాలు కోల్పోయారు. వివరాలివి... బీహార్‌కు చెందిన దీనదయాల్ దీప్ ఆగ్రాలోని ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో లెఫ్టినెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అతడి భార్య రేణు తన్వర్ అదే నగరంలోని సైనిక ఆస్పత్రిలో కెప్టెన్‌గా పనిచేస్తున్నారు. వీరు 2022లో ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇటీవల తన్వర్ తన తల్లి, సోదరుడితో కలిసి వైద్య చికిత్స కోసం దిల్లీ వెళ్లారు. ఏమైందో తెలియదు. రాత్రి భోజనం తర్వాత గదిలోకి వెళ్లిన దీప్ మరుసటి రోజు బయటకు రాకపోవడంతో సహోద్యోగులు తలుపు పగలగొట్టి చూడగా ఉరేసుకుని వేలాడుతూ కనిపించారు. భర్త మరణించాడనే విషయాన్ని తట్టుకోలేక భార్య కూడా దిల్లీ కంటోన్మెంట్‌లోని గెస్ట్ హౌస్‌లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. వీరిద్దరి మృతికి గల కారణాలు తెలియరాలేదు. కాగా... తన్వర్ వద్ద పోలీసులు ఆత్మహత్య లేఖను స్వాధీనం చేసుకున్నారు. తన భర్త దీప్ మృతదేహంతో కలిపి తనకూ దహన సంస్కారాలు నిర్వహించాలని లేఖలో ఆమె కోరారు. తన్వర్ ఆత్మహత్యకు పాల్పడిన సమయంలో ఆమె తల్లి, సోదరుడు ఆస్పత్రిలో ఉన్నట్లు తెలుస్తోంది. దీప్ వద్ద ఎలాంటి ఆత్మహత్య నోటు లభించలేదు.

సిద్ధిఖీ హత్యకు పదిసార్లు యత్నం

దర్యాప్తు అధికారి వెల్లడి

ముంబై: మహారాష్ట్ర ఎన్సీపీ పవార్ వర్గం నేత బాబా సిద్ధిఖీ హత్యకు నిందితులు వరుసగా 10సార్లు ప్రయత్నించారని దర్యాప్తు బృందం అధికారి వెల్లడించారు. కానీ, చివరి నిమిషంలో వేర్వేరు కారణాలతో అవి వాయిదా పడినట్లు ఆయన తెలిపారు. ఈ కేసులో మరో నిందితుడు హరీశ్‌కుమార్ నిషాద్‌ను నిన్న పోలీసులు యూపీలో అదుపులోకి తీసుకొన్నారు. ఇప్పటికే గుర్మైల్ సింగ్, ధర్మరాజ్ కశ్యప్, ప్రవీణ్ లోంకర్ అనే యువకులను అరెస్టు చేశారు. సిద్ధిఖీ హత్య సమయంలో తమవద్ద మందుగుండు తగ్గకూడదని గుర్మైల్ సింగ్, ధర్మరాజ్ దాదాపు 65 తూటాలు సిద్ధం చేశారు. హత్య సమయంలో ఆరింటిని కాల్చారు. ఈ ఘటన అనంతరం అధికారులు నిందితులను అరెస్టు చేసి ఆస్ట్రియాలో తయారైన తుపాకీని, 28 తూటాలు స్వాధీనం చేసుకొన్నారు. హత్య జరిగిన ప్రదేశానికి కొంతదూరంలో ఓ నల్లటి బ్యాగ్‌ను అధికారులు స్వాధీనం చేసుకొన్నారు. దీనిలో తుర్కియేలో తయారైన 7.62 బోర్ పిస్టల్, మరో 30 తూటాలు ఉన్నాయి. శివకుమార్ గౌతమ్ పేరిట ఆధార్ కార్డు దొరికింది. అతడి ఫొటోతోనే సుమిత్‌కుమార్ పేరిట మరో ఆధారం అందులో ఉంది. తొలుత బైకుపై వెళ్లి బాబా సిద్ధిఖీని కాల్చి చంపి వేగంగా తప్పించుకోవాలని నిందితులు పథకం వేశారు. ఇందుకోసం పూణెలో తుక్కు దుకాణం నిర్వహించే నిషాద్‌కు ప్రవీణ్ నుంచి రూ.60 వేల సొమ్ము బదిలీ అయింది. సెకండ్ హ్యాండ్ బైక్ కొనుగోలు చేసిన అతడు... స్వయంగా ముంబై తీసుకెళ్లి నిందితులకు అప్పగించాడు. కానీ, నిందితుల్లో ఇద్దరు ప్రయాణిస్తున్న బైకు రోడ్డు ప్రమాదానికి గురికావడంతో ఆ కుట్ర భగ్నమైంది. చివరికి ఆటో రిక్షాలో వెళ్లి కాల్పులు జరిపి... ఆ తర్వాత దుస్తులు మార్చుకొని పారిపోవాలని నిర్ణయించుకొన్నారు. ఈ కేసులో పరారీలో ఉన్న నిందితుడు శుభం లోంకర్ కోసం పోలీసులు గాలింపును తీవ్రతరం చేశారు. ఇప్పటికే లుకౌట్ నోటీసులు జారీ చేశారు. అతడు నేపాల్ పారిపోయేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ సరిహద్దుల్లో అతడి ఫొటోలను అన్ని ప్రదేశాలకు పంపించారు. హత్యకు మూడ్రోజుల ముందువరకు అతడు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్నాడు. అతడి సోదరుడు ప్రవీణ్‌ను ఇప్పటికే అరెస్టు చేశారు. నిందితులు తుపాకులు వినియోగించడాన్ని ముంబైలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నేర్చుకొన్నట్లు పోలీసులు చెబుతున్నారు. యూట్యూబ్‌లో వీడియోలు చూసి... తూటాలు లోడ్, అన్‌లోడ్ చేయడం, ఆయుధాన్ని వినియోగించడం నేర్చుకొన్నారు. వీరున్న కుర్లాలోని అపార్ట్‌మెంట్‌లో తక్కువ స్థలం ఉండటంతో 'డ్రైప్రాక్టీస్' డ్రిల్స్ మాత్రమే చేసినట్లు అధికారులు తెలిపారు. గన్స్‌తో రిహార్సల్స్ కూడా చేసినట్లు పేర్కొన్నారు. నిందితుల్లో ఒకడైన శివకుమార్ గౌతమ్‌కు మాత్రం తుపాకుల వాడకం వచ్చు. అతడు గతంలో ఉత్తరప్రదేశ్‌లో జరిగిన వేడుకల్లో గాల్లోకి కాల్పులు జరిపిన సందర్భాలున్నాయి. అతడిని ఈ కేసులో ప్రధాన షూటర్‌గా భావిస్తున్నారు. కశ్యప్, సింగ్‌కు అతడే శిక్షణ ఇచ్చినట్లు అనుమానిస్తున్నారు. వీరు ముగ్గురు స్నాప్‌ఛాట్, ఇన్‌స్టా ద్వారా తరచూ సంభాషించుకొన్నట్లు అధికారులు గుర్తించారు. హత్య పథకం అమలుచేసేందుకు కొన్ని యాప్స్ కూడా వాడినట్లు గుర్తించారు.

గవర్నర్ల మార్పుపై కేంద్రం కసరత్తు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం త్వరలో కొన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల గవర్నర్లను బదిలీ చేసే అవకాశం ఉంది. అనేక రాష్ట్రాల్లో గవర్నర్‌లు, లెఫ్టినెంట్ గవర్నర్‌లు ఇప్పటికే మూడు నుంచి ఐదు సంవత్సరాలకు పైగా పనిచేసినందున బదిలీల ప్రక్రియ జరపాలని కేంద్రం నిర్ణయించినట్లు తెలిసింది. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, కేరళ, జమ్మూకశ్మీర్, కేంద్ర పాలిత ప్రాంతాలైన అండమాన్ నికోబార్ దీవులు, దాద్రా నగర్ హవేలీ, డామన్ దయ్యూలలో గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లు మారనున్నారు. జమ్మూ కశ్మీర్‌లో లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా నాలుగేళ్లకు పైగా పదవిలో ఉన్నారు. సిన్హా స్థానంలో ఆర్ఎస్ఎస్‌తో సంబంధాలున్న, అసెంబ్లీ ఎన్నికల్లో కీలక పాత్ర పోషించిన ఆర్ఎస్ఎస్ నేత రామ్‌మాధవ్‌ను భర్తీ చేసే అవకాశం ఉందని ఊహాగానాలు జోరందుకున్నాయి. ఆరిఫ్ మహ్మద్ ఖాన్ ఐదేళ్లకుపైగా కేరళ గవర్నర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు వేరే పదవి ఇచ్చే అవకాశం ఉంది. అండమాన్ నికోబార్ దీవుల లెఫ్టినెంట్ గవర్నర్ దేవేంద్ర కుమార్ జోషి పదవీ విరమణ చేయవచ్చు. లేదంటే కేరళ, జమ్మూ కశ్మీర్‌లకు నూతన బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. కర్నాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లాత్, గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్ మూడేళ్లకు పైగా తమ పదవుల్లో కొనసాగుతున్నారు. 2021లో బాధ్యతలు స్వీకరించిన గోవా గవర్నర్ శ్రీధరన్ పిళ్లై, 2021 నుండి పదవిలో ఉన్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ కూడా మూడేళ్లకు పైగా పదవీకాలం పూర్తి చేసుకున్నారు. మధ్యప్రదేశ్ గవర్నర్ మంగూభాయ్ సి పటేల్ ఉత్తరాఖండ్ గవర్నర్ గుర్మిత్ సింగ్‌కు సంబంధించి మూడేళ్ల పదవీ కాలం పూర్తయింది. ఉత్తరప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్ ఐదేళ్లు... తమిళనాడుకు ఆర్ఎన్ రవి, గోవాకు పీఎస్ శ్రీధరన్ పిళ్లై మూడేళ్లుగా గవర్నర్లుగా కొనసాగుతున్నారు. మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల తర్వాత పునర్వ్యవస్థీకరణ జరగవచ్చని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయని సీనియర్ బీజేపీ నేతలను గవర్నర్ లేదా ఎల్‌జీలుగా నియమించే అవకాశం ఉంది.

సుప్రీంకోర్టులో న్యాయదేవత కొత్త విగ్రహం

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టులో కొన్ని మార్పులతో కొత్త న్యాయదేవత (లేడీ ఆఫ్ జస్టిస్) విగ్రహం దర్శనమిచ్చింది. చట్టం గుడ్డిది కాదన్న సందేశా న్నిచ్చేలా న్యాయదేవత కళ్లకు కట్టి ఉండే నల్ల రిబ్బన్‌ను తొలగించడంతో పాటు అన్యాయాన్ని శిక్షించడంలో ప్రతీకగా నిలిచే చేతిలోని ఖడ్గం స్థానంలో రాజ్యాంగాన్ని కొత్త విగ్రహంలో పొందుపర్చారు. న్యాయదేవత మరో చేతిలో కనిపించే త్రాసును అలాగే ఉంచారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల గ్రంథాలయంలో ఈ కొత్త విగ్రహం కనిపించింది. ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ చంద్రచూడ్ ఆదేశాల మేరకు న్యాయదేవత విగ్రహంలో మార్పులు చేసినట్లు సమాచారం.

బ్రిటిష్ వలసవాద చట్టాలకు స్వస్తి పలుకుతూ కొత్త చట్టాలను అమల్లోకి తెచ్చిన నేపథ్యంలో న్యాయ దేవత విగ్రహంలోనూ మార్పులు చేయాలని గతంలోనే జస్టిస్ చంద్రచూడ్ సూచించారు. 'న్యాయదేవత కళ్లకు గంతలు అవసరం లేదు. చట్టం ఎప్పుడు గుడ్డిది కాదు. అది అందరినీ సమానంగా చూస్తుంది. కత్తి హింసకు ప్రతీకగా కనిపిస్తోంది. కానీ న్యాయస్థానాలు రాజ్యాంగ చట్టాల మేరకు న్యాయాన్ని అందజేస్తాయి' అని అన్నారు.

మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో

ఇండియా ఐక్య సంఘటనకు ఆప్ మద్దతు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీతోపాటు పంజాబ్‌లో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ విస్తరణ ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న అన్ని రాష్ట్రాల్లో బరిలో నిలుస్తోంది. ఇటీవల జమ్మూ కశ్మీర్, హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన ఆప్... హర్యానాలో ఖాతా తెరవలేదు. జమ్మూ కశ్మీర్‌లో ఒక స్థానాన్ని గెలుచుకుంది. అయితే మహారాష్ట్ర, జార్ఖండ్‌లో అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ పోటీ చేస్తుందా అనే ప్రచారం జోరుగా సాగుతోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం జార్ఖండ్, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ పోటీ చేసే అవకాశం కనిపించడం లేదు. రాజకీయ శూన్యత లేని రాష్ట్రాల్లో రెండు, మూడు సీట్ల కోసం ఇతర పార్టీలతో చర్చలు జరపడం వ్యర్థమని పార్టీ సీనియర్ నేతలు భావిస్తున్నారు. మహారాష్ట్రలో విస్తరించాలని ఆప్ కోరుకుంటున్నది. అయితే ఇందుకు కేజ్రీవాల్ సహా పార్టీ అధిష్ఠానం ఆసక్తి చూపట్లేదు. బదులుగా మహారాష్ట్రలో ఇండియా ఐక్యసంఘటన భాగస్వామ్య పార్టీలకు మద్దతు తెలపాలని భావిస్తోంది. కాంగ్రెస్, బీజేపీ ముఖాముఖిగా సాగే ఎన్నికల్లో ఆప్ బరిలో నిలిస్తే... కాంగ్రెస్‌కు ఎక్కువ నష్టం జరుగుతుంది. కొన్ని రాష్ట్రాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే విషయం స్పష్టమైంది. దీంతో మహారాష్ట్ర, జార్ఖండ్‌లో నేరుగా పోటీ చేసే బదులు ఇండియా పార్టీలకు మద్దతు పలకాలని ఆప్ భావిస్తోంది. బీజేపీ వ్యతిరేక ఓట్లు చీలిపోయే అవకాశం ఉన్నందున ఓటర్లలో గందరగోళం సృష్టించకూడదనే ఉద్దేశంతో మహారాష్ట్రలో పోటీకి దూరంగా ఉండాలని పార్టీ నిర్ణయించింది. రెండు రాష్ట్రాల్లో పరిస్థితిని అంచనా వేశాకే తాము ఈ నిర్ణయానికి వచ్చామని సీనియర్ నేత ఒకరు తెలిపారు.

బాలుడి ప్రాణం తీసిన డీజే

భోపాల్: ఈ మధ్య సమాజంలోకి దుష్ట సంస్కృతి ప్రవేశించింది. ఇప్పుడు ఏ శుభకార్యం జరిగినా.. ఏ పండుగ వచ్చినా మొట్టమొదటిగా గుర్తొచ్చేది డీజే సౌండే. ఏ చిన్న కార్యక్రమం జరిగినా నిర్వాహకులు డీజే సౌండ్‌నే బుక్ చేస్తున్నారు. కానీ దాని ప్రభావం కొందరి కుటుంబాల్లో విషాదం నింపుతుందన్న విచక్షణ ఎవరికీ ఉండడం లేదు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో స్థానిక పండుగ సందర్భంగా నిర్వహించిన వేడుకలో నిర్వాహకులు డీజే సౌండ్ ఏర్పాటు చేశారు. అందరూ ఉత్సాహంగా కేరింతలు కొడుతూ గంతులు వేస్తున్నారు. అక్కడే ఉన్న సమర్ బిల్లోర్ అనే బాలుడి(13)కి కూడా ఊపు వచ్చింది. ఏ మాత్రం ఆలస్యంగా చేయకుండా వారి మధ్యలోకి దూరి ఉత్సాహంగా డ్యాన్స్ చేస్తున్నాడు. అయితే డీజే సౌండ్‌కి బాలుడి గుండె తట్టుకోలేకపోయింది. అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. ఇంత జరిగినా మిగతా వారు డ్యాన్స్ చేస్తూనే ఉన్నారు. బాలుడి తల్లి గమనించి.. సౌండ్ ఆపమని ప్రాధేయపడినా ఎవరూ పట్టించుకోలేదు. వెంటనే తల్లిదండ్రులు ఆస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే బాలుడు చనిపోయినట్లు వైద్యులు తెలిపారు.

రైలు టికెట్ల ముందస్తు రిజర్వేషన్ గడువు

60 రోజులకు కుదింపు

న్యూఢిల్లీ: రైలు టికెట్లను ముందస్తుగా బుక్ చేసుకునే గడువులో మార్పులు చేస్తూ భారతీయ రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు రైలు ప్రయాణం తేదీకి 120 రోజుల ముందు టికెట్‌ను బుక్ చేసుకునే అవకాశం ఉండగా... నవంబర్ 1నుంచి 120 రోజులు ఉన్న గడువును 60 రోజులకు కుదించనున్నారు. దీంతో ఏదైనా రైలు టికెట్ ముందుగా బుక్ చేసుకోవాలంటే ప్రయాణ తేదీకి 60 రోజుల ముందు మాత్రమే బుక్ చేసుకునే వీలుంటుంది. భారతీయ రైల్వే తన సేవల్లో ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)ను ఉపయోగించేందుకు వీలుగా ఈ మార్పులు చేసినట్లు రైల్వే శాఖ తెలిపింది. ఈ మార్పు ద్వారా ప్రయాణీకులు కోరుకున్న సీటును వారికి కేటాయించే అవకాశాలు పెరగనున్నాయి. ఈ నిబంధన కేవలం ముందుగా బుక్ చేసుకునే రైల్వే టికెట్లకు మాత్రమే వర్తించనుంది. ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్‌తో పాటు భారతీయ రైల్వే రిజర్వేషన్ విధానాన్ని అమలుచేసే అన్ని ట్రైన్లకు వర్తిస్తుంది. గతంలో 90 రోజుల ముందుగా టికెట్ బుక్ చేసుకునే అవకాశం ఉండేది. తరువాత దీనిని 120 రోజులకు పెంచారు. ప్రస్తుతం సాంకేతికతను జోడించి.. ప్రయాణీకులకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు రిజర్వేషన్ టికెట్ల బుకింగ్ గడువును 60 రోజులకు తగ్గించినట్లు తెలుస్తోంది. రిజర్వేషన్ రైలు టికెట్ల బుకింగ్ విషయంలో భారతీయ రైల్వే తీసుకొచ్చిన కొత్త నిబంధన నవంబర్1వ తేదీ నుంచి అమలులోకి రానుంది. ఇప్పటికే టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణీకులకు ఎటువంటి ఇబ్బంది లేదు. కేవలం నవంబర్1 నుంచి టికెట్లు బుక్ చేసుకునేవారికి మాత్రమే కొత్త నిబంధన వర్తిస్తుంది. నవంబర్1 నుంచి ప్రయాణ తేదీకి 60 రోజుల ముందు మాత్రమే రిజర్వేషన్ టికెట్‌ను బుక్ చేసుకోగలరు.

కేసు దర్యాప్తు కుట్రపూరితం

మహిళా ఐపీఎస్‌పై సీబీఐ ఎఫ్ఐఆర్

ముంబై: మహారాష్ట్రలోని ఓ మహిళా ఐపీఎస్‌పై సీబీఐ కేసు నమోదు చేసింది. రూ.1200 కోట్ల కుంభకోణానికి సంబంధించిన దర్యాప్తు వ్యవహారంలో ఆమె ఫోర్జరీ, నేరపూరిత కుట్రకు పాల్పడినట్లు వెల్లడించింది. ఈ విషయాన్ని సీబీఐ తాజాగా వెల్లడించింది. జల్‌గావ్ జిల్లాలోని భైచంద్ హీరాచంద్ రైసోనీ క్రెడిట్ సొసైటీ ఫిక్స్‌డ్ డిపాజిట్ల పేరుతో అనేకమందిని మోసం చేసింది. రూ.1200 కోట్లకు పైగా కుంభకోణానికి పాల్పడింది. ఈ కుంభకోణం 2015లో వెలుగులోకి వచ్చింది. ఈ కేసు 2020లో సీబీఐకి బదిలీ అయింది. దీనికి సంబంధించిన కేసులు దర్యాప్తు చేసిన సిట్‌కు ఐపీఎస్ అధికారిణి భాగ్యశ్రీ నవ్‌టకే నేతృత్వం వహించారు. దర్యాప్తులో ఆమె ఎన్నో అవకతవకలకు పాల్పడినట్లు సీబీఐ పేర్కొంది. ఒకే రోజు ఒక్క నేరం కింద మూడు కేసులు నమోదు చేయడం... కేసు కోసం హాజరుకాకుండానే ఫిర్యాదుదారుల సంతకాలు ఫోర్జరీ చేయడంలో అధికారిణి ప్రమేయం ఉన్నట్లు సీబీఐ విచారణలో తేలింది. దీంతో ఆమె నేరపూరిత కుట్రకు పాల్పడినట్లుగా దర్యాప్తు సంస్థ ఫిర్యాదులో ప్రస్తావించింది. ఈ కుంభకోణంపై సీబీఐ నివేదిక ఆధారంగా రాష్ట్ర హోంశాఖ ఇచ్చిన ఆదేశాల మేరకు ఆమెపై ఆగస్టులో పూణె పోలీస్ స్టేషన్‌లో తొలి కేసు నమోదైంది. ఈ పరిణామాల నేపథ్యంలో సీబీఐ కేసు నమోదు చేసింది. 2020లో ఈ వ్యవహారానికి సంబంధించి కంపెనీ డైరెక్టర్లపై సీబీఐ కేసు నమోదు చేసింది. మరుసటి ఏడాది ప్రధాన నిందితుడు జితేంద్ర కందారేను పూణె పోలీసులు అరెస్టు చేశారు. అతడిపై విచారణ కొనసాగుతోంది.

వణికిస్తున్న వరుణుడు!

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- స్తంభించిన రవాణా వ్యవస్థ
- పునరావాస కేంద్రాలకు వరద బాధితులు

బెంగళూరు/చెన్నై: వరుణుడి ఉగ్రరూపానికి కొన్ని దక్షిణాది రాష్ట్రాలు చిగురుటాకులా వణికిపోతున్నాయి. కుండపోత వర్షానికి నగరాలు, పట్టణాలు, పల్లెలు అన్న తేడాలేకుండా నదులు... చెరువులను తలపిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నాయి. పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి సదుపాయాలన్నీ కల్పించారు. రహదారులు జలపాతంలా మారడంతో రవాణా సౌకార్యానికి అంతరాయం ఏర్పడింది. వారం రోజులుగా చెన్నై నీటిలోనే నానుతుంది. కన్యాకుమారి జిల్లా తీరప్రాంతాల నివాసాల్లోకి సముద్ర జలాలు వచ్చి చేరాయి. ఊటీ కొండ ప్రాంత రైలు పట్టాలపై మట్టిపెళ్లలు, బండరాళ్లు పడడంతో రైలు సర్వీసులను నిలిపివేశారు. తుఫాను ప్రభావంతో తీరప్రాంత జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. బెంగళూరు నగరంలో మూడు రోజులపాటు ఎడతెరిపిలేకుండా వర్షం కురిసింది. ఒకటి రెండు గంటలపాటు విరామం ఇచ్చినట్టు అనిపించినా కుండపోత వర్షం తగ్గలేదు. యలహంక చెరువుకు నీరు పోటెత్తడంతో కేంద్రీయ విహార్ అపార్ట్‌మెంట్‌కు భారీగా నీరు వచ్చిచేరింది. కాలిఫోర్నియా లే అవుట్ పూర్తిగా జలమయమైంది. ప్రముఖ ఎంఎన్‌సీ, ఐటీ కంపెనీలు ఉండే మాన్యతాటెక్‌పార్క్ రోడ్డు నదులను తలపించింది. ద్విచక్రవాహనాలు, కార్లు రోడ్లపై వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ఐటీ ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోంను ప్రకటించారు. మాన్యతాటెక్ పార్క్ ప్రాంతం జలపాతంలా మారిందనే ట్రోల్స్ హల్‌చల్ చేశాయి.

నీటిలోనే చెన్నై నగరం...

భారీవర్షాలకు చెన్నై ఇంకా నీటిలోనే నానుతోంది. 539 ప్రాంతాల్లో వరద నీరు నిలువగా, ఇందులో 436 ప్రాంతాల్లో జీసీసీ సిబ్బంది తొలగించారు. మరో 103 ప్రాంతాల్లో 900 మోటార్ల ద్వారా వరద నీటి తొలగింపు పనులు వేగవంతం చేశారు. కీల్పాక్కం అళగప్ప రోడ్డు, నాయర్ జంక్షన్, పురుషవాక్కం కెథడ్రల్ రోడ్డు, మిల్లర్స్ రోడ్డు, కున్నూరు హైవే, శివగామి రోడ్డు, చూలైమేడు పెరియార్ పాఠై, టి.నగర్ పనగల్ పార్క్, వాణిమహల్ జంక్షన్, మేట్టుపాళయం కాళియమ్మన్ ఆలయ వీధి, ఓఎంఆర్ రోడ్డు, ఎస్పార్పీ టూల్స్, ఎంజీఆర్ రోడ్డు, కందన్‌చావిడి తదితర ప్రాంతాల్లో నిలిచిన వరద నీటిలో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సబ్ వేలలో నీటిని తొలగిస్తున్నారు. వరద ముంపు గురైన పటాలం ఆంజనేయ స్వామి వీధి, చూలై, పెరియమేడు, షోలింగనల్లూర్ ప్రాంతాల్లో సహాయ పనులను వేగవంతం చేశారు. మైలాపూర్ శివస్వామి-రాయపేట హైరోడ్డు చెరువును తలపించేలా ఉంది. మైలాపూర్ నాలుగు మాడవీధులు, పరిసర ప్రాంతాల్లో వరద నీటిని తొలగిస్తున్నారు. విరుగంబాక్కం కాళియమ్మన్ ఆలయం, రోహిణి థియేటర్ సమీపంలో ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. విల్లివాక్కం, కొరట్టూరు, అంబత్తూర్, ఓటేరి, అయనావరం, ఐసిఎఫ్, సిడ్కో నగర్ ప్రాంతాల్లో రెండడుగుల మేర నీరు నిలిచింది. కొరట్టూరు హౌసింగ్ బోర్డు కాలనీ ప్రజలు మురుగునీటితో ఆందోళనకు గురయ్యారు. వరద ముంపు ప్రాంతాల ప్రజలకు 300 ప్రాంతాల్లో ఆశ్రయం కల్పించారు. కొందరు తమ ఇళ్లు ఖాళీచేసి బంధువులు, స్నేహితుల ఇళ్లకు పయనమయ్యారు.

ఇళ్లలోకి చొరబడిన సముద్ర జలాలు

కన్యాకుమారి జిల్లా తీర ప్రాంతాల నివాసాల్లోకి సముద్రపు నీరు వరదలా ప్రవేశించింది. పలువురు తమ ఇళ్లలోకి సముద్రపు నీరు రాకుండా ఇసుక బస్తాలు పేర్చి రాత్రంతా జాగారం చేశారు. సుమారు 150కి పైగా ఇళ్లలోకి సముద్ర జలాలు చొరబడ్డాయి. దీంతో వీరిని రెవెన్యూ అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తేంగాయ్‌పట్టినం, ఇరవిబుథన్ తురై, వళ్లవిలై, పూత్తురై, తూత్తురై ప్రాంతాల్లో 15 అడుగుల ఎత్తున అలలు ఎగసిపడ్డాయి. ఇళ్లు కోతకు గురయ్యాయి. త్రివేణి సంగమం, ముట్టమ్ ప్రాంతాలకు పర్యాటకులను అనుమతించలేదు. జాలర్లు చేపల వేటకు వెళ్లొద్దని కూడా ఉత్తర్వులు జారీ చేశారు.

ఊటీ రైలు పట్టాలపై మట్టిపెళ్లలు, బండరాళ్లు

కున్నూరు - ఊటీ మధ్య వివిధ చోట్ల రైలు పట్టాలపై మట్టిపెళ్లలు, బండరాళ్లు పడటంతో రైలు సర్వీసును తాత్కాలికంగా రద్దు చేశారు. ముందు జాగ్రత్త చర్యగా మేట్టుపాళయం నుంచి కున్నూరు దాకా నడిపే కొండ రైలు సర్వీసును రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. పట్టాలపై మట్టి పెళ్లలు, బండరాళ్లను రైల్వే సిబ్బంది తొలగిస్తున్నారు. ఉడ్‌బ్రిడ్జి, పర్లియారు, కేఎస్ఆర్ హిల్‌గ్రోవ్, అటర్లీ తదితర ప్రాంతాల్లో కొండ పైనుంచి నీరు ఉధృతంగా పట్టాలపై పడుతోంది. దీంతో మట్టిపెళ్లలు జారి పట్టాలపై పడుతున్నాయి. ఈ జలపాతాల వలన కొండ రైలు మార్గం తీవ్రంగా దెబ్బతింటుందేమోనని రైల్వే అధికారులు, సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. కున్నూరు సమీపంలోని బ్లాక్‌బ్రిడ్జి - సప్లయిడిపో రహదారిలో మూడు చెట్లు విద్యుత్ తీగెలపై పడ్డాయి. స్థానికుల ఫిర్యాదు మేరకు వెంటనే ఆ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

ఆంధ్రాలోనూ సీఆర్ ఫౌండేషన్

అసోంలో పట్టాలు తప్పిన లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్

గుహవతి: అసోంలోని దిమా హసావో జిల్లాలో రైలు ప్రమాదం సంభవించింది. అగర్తల-లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పింది. అగర్తలా నుంచి ముంబైకి బయల్దేరిన ఈ రైలు ఇంజిన్‌తో పాటు ఎనిమిది బోగీలు పట్టాలు తప్పాయి. అసోంలోని దిబలోంగ్ స్టేషన్ వద్ద ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలిసింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాలేదని రైల్వే అధికారులు వెల్లడించారు. గురువారం మధ్యాహ్నం 3.55 గంటలకు జరిగిన ఈ రైలు ప్రమాదానికి కారణాలు ఇంకా తెలియరాలేదని చెప్పారు. పవర్ కార్, ఇంజిన్‌తో పాటు ఎనిమిది కోచ్‌లు పట్టాలు తప్పాయన్నారు. ఈ ఘటన గురించి సమాచారం అందగానే.. సహాయక బృందాలు చేరుకున్నాయని తెలిపారు. ఈ ఘటనతో లుమ్‌డింగ్-బాదర్‌పూర్ సింగిల్-లైన్ హిల్ సెక్షన్‌లో రైళ్ల రాకపోకలు నిలిపివేసినట్లు వెల్లడించారు.

సేవలు మరింత విస్తరిస్తాం
ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ కే నారాయణ

విశాలాంధ్ర-చల్లపల్లి: చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ సేవలు మరింత విస్తరించి పేద ప్రజలకు అందుబాటులో తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు, సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ పేర్కొన్నారు. గురువారం కృష్ణాజిల్లా చల్లపల్లిలోని చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. పేదలకు అందిస్తున్న సేవా కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని కొండాపూర్ లో ఐదు ఎకరాల విస్తీర్ణంలో సీఆర్ ఫౌండేషన్ నడుస్తోందని తెలిపారు. 85 గదులు, రెండు డార్మెటీరీలలో పేదవారికి ఆరోగ్య కేంద్రాలను, ఉపాధి శిక్షణ కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళలకు ఉపాధిలో శిక్షణ కార్యక్రమాల నిర్వహిస్తూ ఆర్థిక స్వావలంబన దిశగా పయనించేందుకు సీ ఆర్ ట్రస్ట్ కృషి చేస్తున్నట్లు వివరించారు. ఇప్పటివరకు 15 వేల మందికి వివిధ రకాల ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేసినట్లు తెలిపారు. రాష్ట్రం విడిపోయిన నేపథ్యంలో ఇదే తరహాలో ఆంధ్ర రాష్ట్రంలో సీఆర్ ఫౌండేషన్ స్థాపించి ఇక్కడ కూడా సేవలను విస్తరించనున్నట్లు పేర్కొన్నారు. స్థలం మంజూరు కోసం ముఖ్యమంత్రి ని కలిశామని... ప్రక్రియ జరుగుతున్నట్లు వివరించారు. చల్లపల్లిలోని చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రాన్ని సీఆర్ ఫౌండేషన్‌కు అనుసంధానం చేసి అభివృద్ధి చేసే దిశగా ఆలోచన చేస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే ఇక్కడ హోమియో వైద్య శిబిరం నిర్వహిస్తూ అనేక మందికి సేవ చేస్తున్నట్లు వివరించారు. రానున్న రోజుల్లో వృద్ధాశ్రమం కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో పుట్టిన చంద్ర రాజేశ్వరరావు జాతీయస్థాయిలో గుర్తింపు పొందారని... పేద ప్రజల పక్షాన పోరాటలు చేశారని గుర్తు చేశారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం ప్రభుత్వాలతోపాటు స్వచ్ఛంద సంస్థలు సైతం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జీవితంలో అనేక ఒడిదుడుకులు ఎదుర్కొని జీవించిన వారిని వృద్ధాప్యం లో ఆదుకునేవారు కరువవుతున్న తరుణంలో సీఆర్ ఫౌండేషన్ వారికి అండగా నిలిచేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు నారాయణ వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకులు అక్కినేని చంద్రరావు, జిల్లా సహాయ కార్యదర్శి అద్దాడ ప్రసాద్ బాబు, మహిళా సమాఖ్య జిల్లా నాయకులు మల్లు పెద్ది రత్నకుమారి, కంతం నేని జ్యోత్స్న దేవి,పార్టీ నాయకులు మల్లు పెద్ది అజయ్, మల్లు పెద్ది బోసు, కొల్లూరి శ్రీధర్, నాగమల్లి, గంగాధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

గోపాలకృష్ణకు నారాయణ పరామర్శ

ఇటీవల అనారోగ్యానికి గురై చల్లపల్లిలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు అత్తలూరు గోపాలకృష్ణను నారాయణ పరామర్శించారు. ఆయనకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

మిస్ ఇండియా' నిఖిత పోర్వాల్

ముంబై: ఈ ఏడాది ఫెమినా మిస్ ఇండియా కిరీటాన్ని నిఖిత పోర్వాల్ సొంతం చేసుకున్నారు. ముంబైలోని ఫేమస్ స్టూడియోస్‌లో జరిగిన ఈవెంట్‌లో మధ్యప్రదేశ్‌కు చెందిన నిఖిత విజయం సాధించారు. మిస్ వరల్డ్ పోటీల్లో భారత్ తరపున ఆమె ప్రాతినిధ్యం వహించనున్నారు. రేఖా పాండే, ఆయుశీ దోలకియా మొదటి, రెండవ రన్నరప్‌లుగా నిలిచారు. 60వ ఫెమీనా మిస్ ఇండియా పోటీల్లో భాగంగా 29 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన అందాల భామలు పోటీపడ్డారు. కేవలం తమ అందాలతోనే కాకుండా ప్రతిభతోనూ జడ్జిల నుంచి ప్రశంసలు అందుకున్నారు. తుది పోరులో అదరగొట్టిన నిఖిత పోర్వాల్ కిరీటాన్ని సొంతం చేసుకున్నారు. టైటిల్ గెలిచిన తర్వాత సోషల్ మీడియా వేదికగా ఉజ్జయినికి చెందిన నిఖిత తన ఆనందాన్ని వ్యక్తంచేశారు. 'ఇప్పుడు నేను అనుభవిస్తోన్న ఆనందాన్ని వర్ణించలేను. ఇదంతా ఇప్పటికీ నమ్మలేకపోతున్నా. నా తల్లిదండ్రుల కళ్లలోని ఆనందం చూసి గర్వంగా ఉంది. నా ప్రయాణం ఇప్పుడే మొదలైంది. నేను ఇంకా సాధించాల్సిన విజయాలు చాలా ఉన్నాయి' అని ఆమె సంతోషం వ్యక్తంచేశారు. గతేడాది మిస్ ఇండియాగా నిలిచిన నందినిగుప్తా విజేతకు కిరీటం అలంకరించారు.

ప్రజలను ఇబ్బంది పెడితే పోలీసులపైనా చర్యలు: అనిత

సీఐపై చర్యలు తీసుకోవాలని ప్రజాదర్బార్‌లో న్యాయవాది ఫిర్యాదు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: డోన్ పట్టణ సీఐ ఇంతియాజ్ బాషాపై చర్యలు తీసుకోవాలంటూ నంద్యాల జిల్లా డోన్‌కు చెందిన న్యాయవాది లక్ష్మిశెట్టి కృష్ణప్రసాద్ గురువారం మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రజావేదికలో ఫిర్యాదు చేశారు. తమపై అక్రమ కేసులు పెట్టి... టీడీపీ మండల కన్వీనర్ సలింద్ర శ్రీనివాసులును దారుణంగా కొట్టారని, అతడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని, సీఐపై తక్షణమే స్పందించకుంటే దర్నాకు దిగుతామని హెచ్చరించారు. ఈ మేరకు హోంమంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, వాణిజ్య విభాగం అధ్యక్షుడు దూండి రాకేష్, తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్ చిన్నబాబుకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన హోంమంత్రి... జిల్లా పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడారు. విచారించి సర్కిల్ ఇన్స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని, ప్రజలను ఇబ్బంది పెడుతున్న పోలీసులను సస్పెండ్ చేయాలని ఆదేశించారు. వైసీపీ కార్యకర్తలు తన ఇండిపై దాడి చేసి కుటుంబ సభ్యులను అసభ్య పదజాలంతో దూషిస్తూ... తిరిగి తమపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టి వేధిస్తున్నారని... ఆ పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని అల్లూరి జిల్లా కూనవరం మండలం పోలిపాక గ్రామానికి చెందిన షేక్ రసూల్ విజ్ఞప్తి చేశాడు. తన కొడుకును చిత్రహింసలు పెట్టి చంపేశారని... వారిపై కేసు పెట్టడానికి వెళితే గుంటూరు కొత్తపేట పోలీసులు కేసు తీసుకోకుండా..వైసీపీ వాళ్లతో కుమ్మక్కై తననే అవమానిస్తున్నారని గుంటూరుకు చెందిన బడిగినేని పద్మావతి వాపోయారు. తన కుమారుడి చావుకు కారకులైన వారికి కఠిన శిక్షపడేలా చూడాలని కోరారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై అర్జీలు ఇవ్వగా, పరిష్కరిస్తామని నేతలు హామీ ఇచ్చారు.

సల్మాన్ హత్యకు రూ.25 లక్షల సుపారీ

ముంబై: బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ హత్యకు కుట్ర కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మరో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. హర్యానాలోని పానిపట్‌లో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టైన వ్యక్తిని సుఖాగా గుర్తించినట్లు నవీ ముంబై పోలీసులు తాజాగా వెల్లడించారు. 1998 కృష్ణ జింక కేసు నుంచి సల్మాన్ ఖాన్... లారెన్స్ బిష్ణోయ్ ముఠా జాబితాలో ఉన్నారు. ఈ గ్యాంగ్ నుంచి సల్మాన్ అనేకసార్లు హత్య బెదిరింపులు ఎదుర్కొన్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో కూడా గెలాక్సీ అపార్ట్‌మెంట్ వద్ద కాల్పుల ఘటన చోటు చేసుకున్న విషయం తెలిసిందే. మోటారు బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు సల్మాన్ ఇంటి ముందు నాలుగు రౌండ్లు కాల్పులు జరిపి పరారయ్యారు. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న క్రమంలోనే జూన్‌లో మరోసారి సల్మాన్ హత్యకు కుట్ర జరిగింది. పన్వేల్ ఫామ్‌హౌస్ నుంచి ఇంటికి వెళ్తున్న మార్గంలో సల్మాన్‌పై దాడి చేయాలని ఈ గ్యాంగ్ పథకం రూపొందించినట్లు పోలీసులు గుర్తించి... దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులోనే తాజాగా అరెస్ట్ జరిగింది. ఈ కేసుకు సంబంధించి పోలీసులు దాఖలు చేసిన ఛార్జిషీట్‌లో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. సల్మాన్ హత్యకు బిష్ణోయ్ గ్యాంగ్ పక్కా ప్రణాళికతో వ్యవహరిస్తోందని ఛార్జిషీట్‌లో ప్రస్తావించారు. పంజాబీ సింగర్ సిద్ధూ మూసేవాలా హత్య తరహాలోనే కారులో సల్మాన్‌ను హత్య చేయాలని నిర్ణయించినట్లు పోలీసులు గుర్తించారు. రూ.25 లక్షల ఒప్పందం ప్రకారం సల్మాన్‌ను హత్య చేయాలనుకున్నారని, ఆగస్ట్ 2023 నుంచి ఏప్రిల్ 2024 వరకు ఈ హత్య ప్రణాళిక రూపొందించారని ఛార్జిషీట్‌లో పేర్కొన్నారు. సల్మాన్ హత్యకు ఆధునిక ఆయుధాల కొనుగోలుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే నిందితుల ముఠా ఏకే-47, ఎం16, ఏకే-92 తుపాకులు, హై-కాలిబర్ ఆయుధాలు వంటి అధునాతన మారణాయుధాలను పాకిస్థాన్ నుంచి కొనుగోలు చేయాలని భావించారని పోలీసులు వెల్లడించారు.

వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా జరుపుకోవడం హర్షణీయం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ... వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా జరుపుకోవడం హర్షణీయమని హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకుని గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలదండలు వేసి నివాళి అర్పించారు. వాల్మీకి రచించిన ఆదర్శ, అనుచరణీయ, ధర్మబద్ధమైన రామాయణాన్ని ప్రతి ఒక్కరు పఠించి సన్మార్గంలో నడవాలని నేతలు కోరారు. ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, రమణ, శ్రీనివాసరెడ్డి, శ్రీరామ్ చిన్న బాబు, దూండి రాకేష్ , ములక సత్యవాణి, ధారపనేని నరేంద్రబాబు పాల్గొన్నారు.

బిష్ణోయ్ ముఠాపై కెనడా చర్యలు శూన్యం: భారత్

న్యూఢిల్లీ: లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో సంబంధమున్న వ్యక్తులను అప్పగించాలని భారత్ అనేకసార్లు కెనడాను కోరినప్పటికీ అక్కడ నుంచి ఎటువంటి స్పందన రాలేదని భారత్ పేర్కొంది. ఆ ముఠాపై చర్యలు తీసుకోవడంలో విఫలమైందని స్పష్టం చేసింది. ట్రూడో ప్రభుత్వం తీరు, నిరాధార ఆరోపణల వల్లే తాజా సంక్షోభం ఏర్పడిందని ఉద్ఘాటించింది. తాజా పరిణామాలపై భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ స్పందిస్తూ 'లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యులను అరెస్టు చేయాలని కెనడాకు కొన్నేళ్ల క్రితం, ఇటీవల అనేకసార్లు విజ్ఞప్తి చేశాం. భారత్ ఆందోళనలను వారు పట్టించుకోలేదు. ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీని వెనక రాజకీయ ఉద్దేశం ఉంది. బిష్ణోయ్ గ్యాంగ్ ఆగడాల గురించి వివరించాం. వారిని అరెస్టు చేసి భారత్‌కు అప్పగించాలని కోరాం. కానీ, కెనడా నుంచి ఎటువంటి స్పందన లేదు. నేరస్థుల అప్పగింత కేసులకు సంబంధించి ఇప్పటివరకు 26 విజ్ఞప్తులు పెండింగులోనే ఉన్నాయి' అని పేర్కొన్నారు. ఖలిస్థానీ ఉగ్రవాది నిజ్జర్ హత్యలో భారత్ ఏజెంట్ల హస్తం ఉందని చేసిన ఆరోపణలకు సంబంధించి గతేడాది నుంచి కెనడా ఎటువంటి ఆధారాలు ఇవ్వలేదని, విచారణ కమిషన్ ముందు ఇదే విషయాన్ని ట్రూడో అంగీకరించారని భారత్ గుర్తుచేసింది. ఆ తర్వాత కూడా మళ్లీ భారత్‌పై ఆరోపణలు చేయడం శోచనీయమని పేర్కొంది. భారత దౌత్యవేత్తలపై చేసిన ఆరోపణలను మరోసారి ఖండిస్తున్నామని, భారత వ్యతిరేక చర్యలను కెనడా ప్రోత్సహిస్తోందని స్పష్టం చేసింది. రెండు దేశాల మధ్య దౌత్యపరంగా సంక్షోభం ఏర్పడినప్పటికీ ఆర్థిక సంబంధాలు మాత్రం బలంగా ఉన్నాయని తెలిపింది.

కౌలు రైతులకు ఉదారంగా రుణాలు

బ్యాంకర్లకు మంత్రి అచ్చెన్నాయుడు విజ్ఞప్తి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలోని కౌలు రైతులకు రుణాలందించడంలో బ్యాంకర్లు మానవతా దృక్పథంతో ముందుకు రావాలని రాష్ట్ర వ్యవసాయ, పాడి పరిశ్రమాభివృద్ధి,మత్స్య శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన 228వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈసందర్భంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ ఎ.మణిమేఖలై 2024-25 వార్షిక రుణ ప్రణాళిక అమలుకు సంబంధించిన వివరాలు తెలియజేశారు. ప్రాధాన్య రంగం కింద రూ.3లక్షల 75వేల కోట్ల రుణాలు అందించాల్సి ఉండగా, మొదటి త్రైమాసికం (జూన్ 30 నాటికి)లో రూ.లక్షా 36వేల 657 కోట్లు అనగా 36 శాతం రుణాలు బ్యాంకులు మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే వ్యవసాయ రంగానికి సంబంధించి రూ.2.64 లక్షల కోట్లు అందించాల్సి ఉండగా రూ.89వేల 438 కోట్లు (34 శాతం),ఎంఎస్ఎంఇ రంగం కింద రూ.87వేల కోట్లకు గాను రూ.44వేల 150 కోట్లు అందించి 51 శాతం లక్ష్యాన్ని సాధించి నట్టు చెప్పారు. ప్రాధాన్యేతర రంగం కింద రూ.1.65 లక్షల కోట్లు అందించాల్సి ఉండగా 87వేల 731 కోట్లు రుణాలందించి 53 శాతం లక్ష్యాన్ని సాధించినట్టు వివరించారు. దీనిపై మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో 65 శాతానికి పైగా ప్రజలు వ్యవసాయ,అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నందున ఆయా రంగాలకు బ్యాంకులు తగిన తోడ్పాటును అందించాలని కోరారు. ముఖ్యంగా రాష్ట్రంలోని కౌలు రైతులకు 9 లక్షల సీసీఆర్సీ కార్డులు ఇవ్వగా ఇప్పటి వరకూ 2లక్షల మందికి మాత్రమే బ్యాంకులు రుణాలు అందించాయని, మిగిలినవారికి కూడా మానవతా దృక్పథంతో రుణాలివ్వాలన్నారు. రాష్ట్రంలో వచ్చే ఐదేళ్లలో 50 లక్షల ఎకరాలను ప్రకృతి సేద్యం కిందకు తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించిందని తెలిపారు. ప్రభుత్వం ఆరు రంగాల్లో విధాన నిర్ణయాలను ప్రకటించిందని, వాటిలో ఎంఎస్ఎంఇ రంగం ప్రధానమైన రంగమన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీయం ముద్రా యోజన,పీయం విశ్వకర్మ తదితర పథకాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం వివిధ బ్యాంకులకు లక్ష్యాలను నిర్దేశిస్తోందని అయితే క్షేత్ర స్థాయిలో ఆయా పథకాలపై ప్రజలకు తగిన అవగాహన లేకపోవడంతో అవి సక్రమంగా అమలు కావడం లేదని, వీటిపై బ్యాంకర్లు శ్రద్ధ తీసుకుని విజయవంతానికి కృషి చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఇటీవల వరదల్లో బాధితులను ఆదుకునేందుకు బ్యాంకులు ఎంతో తోడ్పాటును అందించాయని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఫైనాన్సియల్ సర్వీసెస్ శాఖ కార్యదర్శిగా ఢిల్లీలో రాష్ట్రం తరపున పనిచేస్తున్న నాగరాజు మద్దిరాల మాట్లాడారు. ఈసమావేశంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పియూష్ కుమార్, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ సీవీఎన్ భాస్కరరావు, రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఏపీ రీజియన్ రీజనల్ డైరెక్టర్ ఎట బషీర్, నాబార్డు డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ జీఎస్.రావత్, చేనేత జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి సునీత,పరిశ్రమలు,వాణిజ్య శాఖ కార్యదర్శి యువరాజ్,ఆర్థికశాఖ కార్యదర్శి జానకి,అదనపు కార్యదర్శి జె.నివాస్ తదితరులు పాల్గొని ఆయా శాఖల ప్రగతిని వివరించారు.

యూజీసీ నెట్ ఫలితాలు విడుదల

న్యూఢిల్లీ: యూజీసీ నెట్ (జూన్) 2024 ఫలితాలు విడుదలయ్యాయి. ఆగస్టు 21 నుంచి సెప్టెంబర్ 5 వరకు మొత్తం 83 సబ్జెక్టులకు ఆన్‌లైన్ విధానంలో నిర్వహించిన ఈ పరీక్ష ఫలితాలను ఎన్‌టీఏ ప్రకటించింది. అక్టోబర్ 10న ఫైనల్ కీ విడుదల చేసిన అధికారులు.. తాజాగా స్కోర్ కార్డులను తమ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. యూజీసీ నెట్‌కు దేశ వ్యాప్తంగా 11,21,225మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా.. 6.84లక్షల మంది మాత్రమే హాజరయ్యారు. వీరిలో 4970మంది జేఆర్ఎఫ్‌కు అర్హత సాధించగా.. 53,694మంది అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు, 1,12,070మంది పీహెచ్‌డీకి మాత్రమే అర్హత సాధించారు. దేశంలోని యూనివర్సిటీల్లో లెక్చరర్‌షిప్ (అసిస్టెంట్ ప్రొఫెసర్), జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, పీహెచ్‌డీల్లో ప్రవేశాల కోసం ఏటా రెండు సార్లు (జూన్, డిసెంబర్) యూజీసీ నెట్ పరీక్షను ఎన్‌టీఏ నిర్వహిస్తున్న సంగతి విదితమే.

యువతకు ఉపాధికల్పనే లక్ష్యం

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ప్రారంభోత్సవంలో అనగాని

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: పెట్టుబడులు సాధించి, పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించి వారి బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ అన్నారు. కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలం కౌతవరంలో రూ.23 లక్షల వ్యయంతో ఆధునీకరించిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే వెనిగండ్ల రాముతో కలిసి గురువారం ప్రారంభించారు. రవీంద్ర మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు దీపావళి కానుకగా రానున్నాయని చెప్పారు. పోర్టు నిర్మాణానికి కలిసికట్టుగా పని చేస్తాం అని హామీ ఇచ్చారు. రాము మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారు అని అన్నారు. జేసీ గీతాంజలి శర్మ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డీఐజీ రవీంద్రనాథ్, జిల్లా రిజిస్ట్రార్ మూర్తి, గుడివాడ ఆర్డీఓ బాలసుబ్రమణ్యం కౌతవరం రిజిస్ట్రార్ మధుసూదనరావు, తహసీల్దార్ లోకరాజు, ఎంపీడీవో సారథి పాల్గొన్నారు.

భార్యను బలాత్కారం చేస్తే నేరమా?

సుప్రీంలో వాదనలు

న్యూఢిల్లీ: భార్యపై బలవంతంగా భర్త అత్యాచారానికి పాల్పడితే నేరం అవుతుందా అనే అంశంపై గురువారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఐపీసీ, భారతీయ న్యాయ సంహిత చట్టాల్లో ఉన్న రాజ్యాంగబద్ధమైన రక్షణపై నిర్ణయం తీసుకోనున్నట్లు సుప్రీం కోర్టు తెలిపింది. మైనర్ కాని భార్యను భర్త బలవంతంగా రేప్ చేస్తే అతన్ని విచారించవచ్చా అన్న అంశంపై సుప్రీంలో చాలా పిటిషన్లు దాఖలయ్యాయి. చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్థీవాలా, మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. వివాహ బంధంలో ఉన్న వారిపై చర్యలు తీసుకుంటే... అప్పుడు ఆ వ్యవస్థ దెబ్బతినే అవకాశాలు ఉన్నట్లు ధర్మాసనం అభిప్రాయపడింది. సీనియర్ న్యాయవాది కరుణా నందీ ఓ పిటిషనర్ తరపున వాదించారు. వైవాహిక అత్యాచారంపై ఐపీసీ, బీఎన్ఎస్‌లో ఉన్న చట్టాలను ఆమె కోర్టుకు వివరించారు. ఇది రాజ్యాంగబద్ధమైన ప్రశ్న అని, తమకన్నా ముందు రెండుసార్లు ఈ అంశంపై కోర్టు తీర్పులు వెలువరించిందని, శిక్షకు సంబం ధించిన కీలకమైన అంశంపై మరోసారి నిర్ణయం తీసుకోవాల్సి ఉందని సీజే చంద్రచూడ్ తెలిపారు. రాజ్యాంగ వ్యతిరేకమైన ఓ నియమాన్ని కొట్టిపారేయాలని కరుణా నందీ కోరారు. ఆ సమయంలో కోర్టు స్పందిస్తూ 18 ఏళ్లు దాటిన భార్యతో లైంగిక చర్యకు పాల్పడడాన్ని అత్యా చారంగా భావించలేమని పేర్కొన్నది. ఐపీసీలోని సెక్షన్ 375 నుంచి మినహాయింపు ఉన్న విషయాన్ని కోర్టు గుర్తు చేసింది. ఆ సెక్షన్ ప్రకారం మైనర్ కాని భార్యతో సెక్స్ చేయడం నేరం కాదు. కొత్తగా ప్రవేశపెట్టిన బీఎన్ఎస్ చట్టంలోని సెక్షన్ 63 ప్రకారం కూడా మినహాయింపు ఉన్నట్లు సుప్రీం ధర్మాసనం వెల్లడించింది. ఆ సెక్షన్ ప్రకారం కూడా భార్యతో సెక్స్ చేయడం నేరం కాదని తెలిపింది. శృంగార కలయికకు భార్య వద్దంటే... ముమ్మాటికీ వద్దు అనే అర్థం వస్తుందని సీనియర్ న్యాయవాది కోలిన్ గొంజాల్వేస్ తెలిపారు. రేప్, హింస... పెళ్లి వ్యవస్థను దిగజారు స్తాయని ఆయన అన్నారు. ఏ వివాహ వ్యవస్థలో అయినా ఒకసారి వద్దు అంటే... వద్దు అన్నట్లే లెక్క అని వెల్లడించారు. వైవాహిక అత్యాచారం కేసుల్లో అంతర్జాతీయ ప్రమాణాలకు తగినట్లు భారత చట్టాలు లేవని గొంజాల్వేస్ తెలిపారు. వివాహ వ్యవస్థలో భార్య ఎప్పుడు లైంగిక చర్యకు అనుమతి ఇస్తుందో... ఎప్పుడు నిరాకరిస్తుందో ఎలా తెలుస్తుందని జస్టిస్ పార్థీవాలా ప్రశ్నించారు. అత్యాచారం నుంచి ఓ వివాహిత మహిళను రక్షించడం వల్ల వివాహ వ్యవస్థకు నష్టం కలగదని, పెళ్లి అనేది వ్యక్తిగతమైందని, అది వ్యవస్థీకృతమైంది కాదని న్యాయవాది కరుణ పేర్కొన్నారు. దంపతుల మధ్య అనుమతి లేని శృంగార చర్యను నేరంగా భావిస్తే... అది సామాజిక వ్యవస్థపై ప్రభావం చూపుతుందని తమ పిటిషన్‌లో కేంద్రం వాదించింది.

సహజీవనం చేస్తున్న మహిళపై అనుమతి లేకుండా శృంగారం చేస్తే అది రేప్ అవుతుందని, వివాహిత మహిళపై పదేపదే క్రూరమైన చర్యకు పాల్పడితే అది రేప్ ఎందుకు కాదని న్యాయవాది కరుణ ప్రశ్నించారు. మారిటల్ రేప్ సెక్షన్‌లో ఉన్న మినహాయింపు వల్ల సమానత్వ హక్కు, లింగ సమానత్వం, భావ స్వేచ్ఛను కోల్పోతున్నట్లు ఆమె తెలిపారు.

కివీస్ పేసర్లకు దాసోహం

46 పరుగులకే కుప్ప కూలిన టీమిండియా
బెంగళూరు టెస్టులో ఆధిక్యంలో కివీస్

బెంగళూరు: స్వదేశంలో తిరుగులేదని భావిస్తున్న టీమిండియాకు న్యూజిలాండ్ బౌలర్లు షాక్ ఇచ్చారు. కివీస్ పేసర్లకు భారత బ్యాటర్లు దాసోహమన్నారు. మొదటి ఇన్నింగ్స్‌లో 31.2 ఓవర్లలోనే 46 పరుగులకే ఆలౌటై 92 ఏళ్ల భారత టెస్టు క్రికెట్ చరిత్రలో చెత్త రికార్డును నమోదుకు కారణమయ్యారు. మొత్తం ఇన్నింగ్స్‌లో ఐదుగురు బ్యాటర్లు డకౌట్ అయ్యారు. ఇద్దరు మాత్రమే డబుల్ డిజిట్ స్కోరు చేశారు. రిషభ్‌పంత్ (20), యశస్వి జైస్వాల్ (13) కాసేపు పోరాడారు. కివీస్ బౌలర్లలో మ్యాట్ హెన్రీ 5 వికెట్లు, ఓరౌర్కీ నాలుగు వికెట్లు పడగొట్టగా.. టిమ్ సౌథీ ఓ వికెట్ పడగొట్టారు. బెంగళూరులోని ఎం.చిన్నస్వామి స్టేడియంలో భారత్-న్యూజిల్యాండ్ జట్ల మధ్య జరుగుతున్న తొలి టెస్టు రెండో రోజు పరిస్థితి ఇది. తొలుత బంతితో అదరగొట్టి మొదటి ఇన్నింగ్స్‌లో టీమిండియాను 46 పరుగులకే ఆలౌట్ చేసిన కివీస్... తర్వాత బ్యాటింగ్‌లోనూ సత్తాచాటుతోంది. రెండో రోజు గురువారం ఆట ముగిసే సమయానికి 3 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. రచిన్ రవీంద్ర (22 బ్యాటింగ్), దారిల్ మిచెల్ (14 బ్యాటింగ్) నాటౌట్‌గా క్రీజులో ఉన్నారు. ప్రస్తుతం న్యూజిలాండ్ 134 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఓపెనర్ డేవాన్ కాన్వే (91బీ 105 బంతుల్లో 11 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడి శతకం ముంగిట పెవిలియన్ చేరాడు. విల్ యంగ్ (33), టామ్ లాథమ్ (15) పరుగులు చేశారు. భారత బౌలర్లలో కుల్‌దీప్ యాదవ్, రవీంద్ర జడేజా, అశ్విన్ తలో వికెట్ పడగొట్టారు. కాన్వే ఆరంభం నుంచే దూకుడుగా ఆడగా.. టామ్ లాథమ్ అతడికి సహకరించాడు. లాథమ్‌ను కుల్‌దీప్ యాదవ్ వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడంతో 67 పరుగుల వద్ద కివీస్ మొదటి వికెట్ కోల్పోయింది. తర్వాత విల్ యంగ్‌తో కలిసి కాన్వే ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. విల్ యంగ్‌ను జడేజా ఔట్ చేయడంతో 75 పరుగుల పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. కాసేపటికే అశ్విన్ బౌలింగ్‌లో కాన్వే రివర్స్ స్విప్ షాట్ ఆడబోయి క్లీన్‌బౌల్డ్ అయ్యాడు.

బౌలర్లకు సహకరించిన పిచ్

గత రెండు రోజులుగా వర్షం పడటంతో పిచ్ పేస్ బౌలర్లకు సహకరించింది. ఆరంభం నుంచే కివీస్ పేసర్లు కట్టుదిట్టంగా బంతులేశారు. ఓపెనర్లు రోహిత్ శర్మ (2), యశస్వి జైస్వాల్ (13) ఆచితూచి ఆడారు. దాదాపు ఆరు ఓవర్లపాటు వికెట్ ఇవ్వలేదు. రోహిత్ ఎటాకింగ్ చేసి కివీస్ బౌలర్లను దెబ్బ కొడదామని భావించినప్పటికీ సీనియర్ బౌలర్ సౌథీ ఇన్‌స్వింగర్‌తో రోహిత్‌ను క్లీన్‌బౌల్డ్ చేశాడు. ఆ తర్వాత వచ్చిన కోహ్లీ (0), సర్ఫరాజ్ ఖాన్ (0) కివీస్ ఫీల్డర్ల దెబ్బకు పెవిలియన్‌కు చేరక తప్పలేదు. వారు ఇచ్చిన క్యాచ్‌లను అద్భుతంగా ఒడిసిపట్టారు. రిషబ్‌పంత్ (20)తో కలిసి యశస్వి జైస్వాల్ వికెట్ పతనాన్ని అడ్డుకొన్నాడు. దాదాపు 11 ఓవర్లపాటు వికెట్ ఇవ్వలేదు. అయితే, యశస్వి ఏకాగ్రత కోల్పోయి ఔటయ్యాడు. ఇక ఆ తర్వాత భారత ఇన్నింగ్స్ కుప్పకూలడానికి మరింత సమయం పట్టలేదు. వచ్చిన బ్యాటర్ వచ్చినట్లే పెవిలియన్‌కు చేరారు. ఆఖర్లో సిరాజ్ (4) బౌండరీ కొట్టాడు. మొత్తం ఇన్నింగ్స్‌లో ఇది నాలుగో బౌండరీ మాత్రమే. రిషబ్ 2 కొట్టగా.. ఒకటి యశస్వి బ్యాట్ నుంచి వచ్చింది. 92 ఏళ్ల టెస్టు క్రికెట్ చరిత్రలో సొంతగడ్డపై జరిగిన మ్యాచ్‌లో టీమ్ఇండియా అత్యల్ప స్కోరు ఇదే. ఈ మ్యాచ్‌లో 46 పరుగులు చేసింది. గతంలో విండీస్‌పై (1987) 75 పరుగులే చేయగలిగింది. మొత్తంగా చూస్తే మూడో అత్యల్ప స్కోరు. కాగా అడిలైడ్‌లో ఆసీస్ చేతిలో 36 పరుగులకే భారత్ జట్టు ఆలౌటైంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.